నేటి దినపత్రిక
# సూర్య
www.surya.com
బుధవారం
17 జులై
2024
పేజీలు 8
## అమరావతి
గుంటూరు - పల్నాడు
కృష్ణా - ఎన్టీఆర్



- ఇది వరకు కష్టించిన వారికి పదవులు
- ఇప్పుడు సర్వేలతో నెగ్గిన వారికే పదవులు
- ఆశావాహులలో నిరుత్సాహం
- ఔత్సాహికులకు నిద్ర కరువు

## నామినేటెడ్ పదవులు..

# సర్వేలతోనే..!



రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టి వంద రోజులు గడిచింది. సుమారు ఐదేళ్లపాటు అనేక ఇబ్బందులకు గురై, అప్పటి అధికార పార్టీ ఆవలంభించిన విధానంతో పోరాడి ఆర్థికంగానూ, రాజకీయపరంగాను అనేకమంది నష్టపోయారు. ముఖ్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికంగా నష్టపోయారని చెప్పవచ్చు. ప్రధానంగా టిడిపి ఇచ్చిన ప్రతి పిలుపును అందుకొని, ఎక్కడికక్కడ పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం, ఆందోళనలు చేయడం జరిగింది. మరీ ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా టిడిపి క్యాడర్ బూత్ కమిటీ నుంచి స్టేట్ కమిటీ వరకు ఐక్యంగా అనేక ఆందోళనలు, కార్యక్రమాలు చేసి పార్టీకి అండగా నిలవడం విశేషం.

**నేటిదినపత్రిక సూర్య బ్యూరో, గుంటూరు**

వీరికి మద్దతుగా జనసేన కూడా నిలవడం తెలిసిందే. అయితే బీజేపీ మాత్రం అంతర్గతంగా మద్దతు తెలిపినా, బహిరంగంగా అయితే అంటే అంటున్నట్లు ఉంటూ వచ్చింది. కానీ సార్వత్రిక ఎన్నికలలో కూటమిగా ఏర్పడి ఎన్నికల ప్రచారంలో మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు విశేషంగా కృషిచేసి, కసి, పట్టుదలతో పని చేయడం జరిగింది. దీంతో ఎన్నికలలో తిరుగులేని మెజార్టీతో రాష్ట్రంలో అధికార పగ్గాలు కూటమికి దక్కడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తమకు మంచి రోజులు వచ్చాయని టిడిపి, జనసేన వర్గాలు అదేవిధంగా బీజేపీ వర్గాలు భావిస్తూ వస్తున్నాయి. ముఖ్యంగా టిడిపి వర్గాలు పలు ఆశలు పెట్టుకొని రాజకీయ పదవులు ముఖ్యంగా నామినేటెడ్ పదవులు దక్కి తాము పడ్డ శ్రమకు ఫలితం దక్కుతుందని ఆశతో ఉన్నాయి. దీని కోసం పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని అధిష్టానం దృష్టిలో పెట్టుకొని వారికి న్యాయం చేయడం జరుగుతుందని ఎన్నికల సందర్భంగా చెబుతూ వచ్చారు. ఎన్నికలు ముగిశాయి అధికారం చేపట్టాము ఇక తాము ఏదోఒక పదవిలో ఉంటామని

మిగతా 3లో..

# కిడ్నీ రాకెట్ కేసులో ఇద్దరు అరెస్ట్

**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** డబ్బులు ఇస్తామని మాయ మాటలు చెప్పి గార్లపాటి మధుబాబు నుండి కిడ్నీ ని దోచేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను మంగళవారం నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. మొదట ఫేస్బుక్ ద్వారా పరిచయమైన విజయవాడ ఏలూరు రోడ్డు ప్రాంతానికి చెందిన సయ్యద్ యూసుఫ్ సోను భాషా ఏ భాషా, కృష్ణా జిల్లా బంటుమిల్లి నరసప్ప చెరువు ప్రాంతానికి చెందిన నిమ్మకాయల సుబ్రమణ్యం ను అరెస్ట్ చేసినట్లు వెస్ట్ డిఎస్పి మహేష్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే ... ఫిర్యాది స్వగ్రామం గరికపాడు గ్రామము, క్రోసూరు మండలం. అతను గతంలో భార్య పిల్లలతో ఫిరంగిపురం గ్రామం లోని సాయిబాబా గుడి ప్రక్కన నివాసం ఉంటూ ప్రస్తుతం తన బంధువు వరుసకు అక్క ఇంట్లో నివాసం ఉంటున్నాడు. బ్రతుకు తెరువు నిమిత్తం ఫ్యాన్సి షాపు, కూరగాయలు షాపు వంటి చిన్న చిన్న వ్యాపారాలు చేసి ఏ వ్యాపారం కలసి రాక ఆర్థికంగా నష్ట పోయి సుమారు రూ. 8 లక్షలు అప్పు చేసినాడు. అప్పులు తీర్చలేక, కుటుంబాన్ని పోషించలేక ఏమీ తోచని పరిస్తుతుల్లో 'మధు హనీ' పేరుతో ఉన్న తన ఫేస్బుక్ అకౌంటు నుండి ఆన్ లైన్ నందు చూస్తూ ఉండగా అక్కడ ఆల్ ఇండియా కిడ్నీ డోనర్స్ గ్రూపులో కిడ్నీ డొనేట్ కావలెను అనే ఆప్షన్ చూసినాడు. ఆ కిడ్నీ

మిగతా 3లో..



# లబ్ధి చేకూరాలంటే.. కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరి

**పీఎం కిసాన్ యోజన వెరిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి కావాలి**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. సృజన**



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** కౌలు రైతులకు క్రాఫ్ కల్టివేటర్ రైట్స్ కార్డ్ (సీసీఆర్సీ) పంపిణి, పీఎం కిసాన్ యోజన వెరిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల ప్రగతిపై జిల్లా కలెక్టర్ జి. సృజన సమీక్షా సమావేశం

మిగతా 3లో..

# దురదృష్టకర రోజులుపోయాయి...

- రానున్నవి ఉద్యోగులకు మంచి రోజులే...
- జీపీఎస్ పై గెజిట్ ఉత్తర్వుల నిలుపుదల హర్షణీయం
- గత ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలపై శ్వేత పత్రం విడుదల చేయండి...
- ఏపీ ఎన్జీవో నేతలు కె.వి. శివారెడ్డి, సిహెచ్.పురుషోత్తం నాయుడు, ఏ.విద్యా సాగర్.

**విజయవాడ, మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వం ఉద్యోగుల అభీష్టానికి వ్యతిరేకంగా సి పి ఎస్ కు ప్రత్యామ్నాయంగా నిరంకుశంగా అమలు చేయాలని ప్రయత్నించిన గ్యారెంటీ పెన్షన్ స్కీం (జి.పి.ఎస్.) గాజెట్ ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించడం రానున్న రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు జరిగే మంచి కార్యక్రమాలకు శుభ పరిణామమని గతప్రభుత్వం ఉద్యోగులకు యిచ్చిన మోసపూరిత వాగ్దానాలు చెల్లించాల్సిన బకాయిలు పై శ్వేత పత్రం విడుదల చేయాలని కె.వి. శివారెడ్డి అన్నారు. గాంధీ నగర్ లోని ఎన్జీవో హోం లో మంగళవారం రాష్ట్ర సంఘ ప్రధానకార్యదర్శి సిహెచ్. పురుషోత్తమనాయుడు జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తో కలసి



శివారెడ్డి పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. నూతన ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన తొలి మాసంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు నిర్ణీత వ్యవధిలో ఒకటో తేదీన జీతాలను జమ చేయడం పట్ల ఉద్యోగులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వేతనాలతో పాటు రానున్న రోజుల్లో కూడా ప్రభుత్వ ఉద్యోగుల పాత బకాయిల విషయంలో కూడా సానుకూలంగా ఉద్యోగులకు మేలు చేస్తుందని నమ్ముతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఉద్యోగులందరూ తమ శక్తి మేరకు విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను రౌడీలు గూండాలు కంటే

మిగతా 3లో..

## కార్మెల్ మాత దీవెనలు ప్రతి కుటుంబం పై ఉంటాయి.. శ్రావణ్



**ఫిరంగిపురం మేజర్ న్యూస్:** ఫిరంగిపురంలో జరుగుతున్న కార్మెల్ మాత ఉత్సవాలలో మంగళవారం తాడికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే కార్మెల్ కొండ వద్దకు వచ్చి కార్మెల్ మాత వారి స్వరూపం వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కార్మెల్ మాత దీవెనలు ప్రతి కుటుంబం పై ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫాదర్ ఫాతిమా మర్రెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



**మంగళగిరి టౌన్ మేజర్ న్యూస్:** ఇంట్లో కుటుంబ సభ్యులను ఎది రించి ప్రేమ వివాహం చేసుకుని ఓ యువ జంట పోలీసులను ఆశ్ర యించిన ఘటన మంగళగిరిలో చోటుచేసుకుంది ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన స్వర్గం వెంకట శ్రీనివాస్, అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న రోష్మి గత కొద్దికాలంగా ప్రేమించుకుంటున్నారు ఇరువురి కులాలు వేరు కావడంతో పెద్దలు తమ వివాహానికి నిరాకరిస్తారనే భయంతో ప్రేమ వివాహం చేసుకొని రక్షణ కోసం మంగళగిరి పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఇరువురూ మేజర్లు కావడంతో వారు ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నామని తెలపడంతో, వారి కుటుంబ సభ్యులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించి వేశారు

## బావకు నాగవల్లి దళార్చన



**గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్:** స్థానిక విద్యానగర్ మూడో లైన్‌లోని శ్రీ గణపతి దత్తాత్రేయ సహిత శ్రీ సాయినాధుని సన్ని ధానంలో గురు పౌర్ణమి మహో త్సవాల సందర్భంగా మంగళ వారం బాబాకు నాగవల్లి ద ళార్చన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు ఆష ష్ శర్మ నిర్వహణలో బాబా మూల విరాట్ కు విశేష అభిషేకాలు,అర్చనలు అలంకరణ, జరిగాయి. సామూహికశ్రీ సాయిరాం నా మ అఖండ సంకీర్తన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు య డ్లపాటి అశోక్ కుమార్,అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య కార్యదర్శి యడ్లపాటి స్వరూప రాణి కార్యదర్శిసంజీవరావు, ఆవుల అప్పారావు పాల్గొన్నారు

## మహిళలపై దాడులు కొనసాగితే సహించేది లేదు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య



**పొన్నూరు మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ కరువైందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య ఆరోపించారు. స్థానిక ఆయన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి న కొద్ది కాలంలోనే ఒకపక్క దళితులు మైనార్టీలపై దాడులు చేస్తూ మరో ప్రక్క అభం శుభం తెలియని మహిళలపై దాడులు జరుగుతున్న కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందని ,ఆయన దుయ్యబట్టారు. ఈపురుపాలెం సంఘటన దగ్గర నుండి ఇప్పటివరకు సుమారు 7,8 మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగిన నిందితులపై ఇప్పటి వరకు సరైన చర్యలు తీసుకోలేదని రాష్ట్రంలో హెూం మంత్రి మహిళయి ఉండి కూడా పరామర్శించి ధైర్యం చెప్పే కార్యక్రమం ఇంతవరకు చేపట్టలేదని, ఇది సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు . డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం పక్కనపెట్టి లోకేష్ రాసిన రెడ్బుక్ ఆధారంగా పరిపాలనను కొనసాగిస్తుందని , ఇది సరైన విధానం కాదని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, వైసీపీ కార్యకర్తలపై, గత ప్రభుత్వం పై కక్ష సాధింపు చర్యలు మానుకొని రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం వారికి అండగా ఉన్నామని భరోసా కలిగించే విధంగా మంచి చేయాలని ఆయన కోరారు. రానున్న రోజుల్లో మహిళలపై ఇదేవిధంగా దాడులు కొనసాగిస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# చేబ్రోలు అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి..రజక సేవా సంఘం




**గుంటూరు మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెం గ్రామంలో పెరుపోగు శైలజ అత్యాచారం చేసి చంపిన ముద్దాయి అయినా నాగరాజును కఠినంగా శిక్షించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, 7వ తరగతి చదువుతున్న ముక్కుపచ్చలారని మైనర్ బాలికను అత్యాచారం చేయటం, దుర్మార్గ చర్యని ఇలాంటి వ్యక్తిని ఉరితీయాలని జూపూడి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాడులు పెరిగిపోయినాయని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రాష్ట్రంలో రక్షణ కరువైందని, జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. రాయలసీమలో బీసీ మహిళలపై అత్యాచారం చేసి చంపటంపై, రజకుల శీను పై దాడి చేయటం, చీరాల బిసి అమ్మాయిపై అత్యాచారం చేసి చంపటం, అనేక గ్రామాల్లో రజకులపై దాడులు చేయటం సిగ్గుచేటు అని,రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై న్యాయ విచారణ జరిపించాలని, జూపూడి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పేరుపోగు శైలజ కుటుంబానికి న్యాయం చేయాలని, గవర్నమెంట్ హాస్పటల్ మార్చి రూమ్ ముందు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కూచిపూడి సత్యం మాదిగ నాయకత్వం లో మెయిన్ రోడ్డు మీద ధర్నా నిర్వహిచారు,ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ధర్నాలో పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి నూతన కార్యవర్గం ఏర్పాటు

- **రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి అధ్యక్షులుగా రావూరి రమేష్ బాబు**
- **కార్యదర్శిగా సుకుమార్ రెడ్డి, కోశాధికారి రవీంద్ర రెడ్డి**









**మంగళగిరి మేజర్ న్యూస్:** రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.సోమవారం సాయంత్రం ప్రాతూరులో అపర్ణ క్లబ్ హౌస్ లో రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి నూతన కార్యవర్గం ఏర్పాటయింది. రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, కార్యదర్శిగా సుకుమార్ రెడ్డి, కోశాధికారిగా రవీంద్ర రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఇన్ స్టలేషన్ ఆఫీసర్ రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి పాల్గొని దగ్గరుండి ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ సభ్యులంతా ఐక్యంగా ఉండి సేవలో ముందుకు సాగాలన్నారు. నూతనంగా రోటరీ క్లబ్ తాడేపల్లి అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన రావూరి రమేష్ బాబు, కార్యదర్శి సుకుమార్ రెడ్డి, కోశాధికారి రవీంద్రారెడ్డి,సభ్యులు, రోటరీ ద్వారా మరిన్ని మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి అధ్యక్ష కార్యదర్శులు రావూరి రమేష్ బాబు, సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ మా మీద నమ్మకం ఉంచి ఇంతటి బాధ్యతను అప్పగించిన రోటరీ కి ప్రత్యేక ధన్యవాదాలుతెలుపుతున్నామన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి రోటరీ సేవలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు అసిస్టెంట్ గవర్నర్స్ ఎం.వంశీ కృష్ణ, పి డి జి అన్నే రత్న ప్రభాకర్, పబ్లిక్ ఇమేజ్ కోచ్ చైర్మన్ అనిల్ చక్రవర్తి,రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి మాజీ అధ్యక్షులు కిరణ్ పరుచూరి,మాజీ కార్యదర్శి చంద్ర ఓబులా రెడ్డి, మాజీ కోశాధికారి గోపు నాగ రాజేష్, కాట్రగడ్డ శివన్నారాయణ, పలగాని శ్రీకాంత్, కె.వి చంద్రశేఖర్ రెడ్డి,గొల్లవల్లి శ్రీలత,జొన్న కిషోర్,డి వెంకట నరసింహ, కొండపాటి నరేంద్ర,జొన్న రాజేష్,కొత్తలంక అమరేంద్ర,కావూరి వెంకట నగేష్, జట్టి శ్రావణి, శెట్టి రామకృష్ణ, కళ్ళం రాజశేఖర్ రెడ్డి,బొంతు అప్పిరెడ్డి, శంకర్ శెట్టి రమేష్,పలగాని శ్రీనివాసరావు,మద్దిరాల బసివి రెడ్డి,రాచర్ల శ్రీనివాసరావు,దోనెపూడి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంపాలెం ప్రాంతంలో పారిశుధ్య సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**అధికారులకు ఆదేశం: గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గుంటూరు 23వ డివిజన్ లోని అనేక ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు వెంటనే పరిష్కరించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం 23వ డివిజన్ లోని వడ్డెగూడెం,గూండారావుపేట, సయ్యద్ సాహెబ్ కాలనీ,నగరంపాలెం ప్రాంతాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి విస్తృతంగా పర్యటించారు. తొలుత గూండారావుపేట చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి, డివిజన్ లో పర్యటించిన ఎమ్మెల్యేకు పారిశుధ్య సమస్యలు స్వాగతం పలికాయి.డివిజన్ లోని స్టాల్ గర్ల్స్ హై స్కూల్ ఎదురు సందులో మ్యాన్ హెూల్ సమస్య ఉన్నదని, డ్రైనేజి నీళ్లు రోడ్డు మీద పారుతున్నాయని, తీవ్ర దుర్గంధం వలన అనారోగ్యానికి గురవుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. మస్తాన్ బాబా దర్గా వెనుక రోడ్డులో పిచ్చి మొక్కలు పెరిగి, విషసర్పాలు తిరుగుతున్నాయని, మెయిన్ రోడ్డులో ఉన్న తమ ఇంటి ముందు మురుగునీరు తొలగించటం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొనిరాగా, మునిసిపల్ సానిటరీ అధికారులు డ్రైనేజి విషయంలో ఎందుకు ఇంత నిర్లక్ష్యం ఎందుకు వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రతి ప్రాంతములో పారిశుధ్య సమస్యలే అధికముగా ఉన్నాయని వెంటనే మురుగును తొలగించాలని అధికారులను ఆదేశించారు. పాత గుడ్డల బజార్ లో ఒక ఉచిత మంచి నీటి కుళాయిని ఏర్పాటు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో లామ్ వర్ధన్ రావు, సాదు రాజేష్, గంటా పెద్దబ్బాయి, మౌలిక, యాకోబు, గంధం చలపతి,ఇంతియాజ్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.వి.ఆర్.జే.సి.అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** నూతన పరిశోధనలు నాణ్యతతో కూడిన బోధనా సరళకి సులభతరం అవుతుందని ఆర్ వి ఆర్ అండ్ జె సి కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్ వి ఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న పొందూరి శివప్రసాద్ కు విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ, బెల్గావి, డాక్టరేట్ ప్రధానం చేసింది. అధ్యాపక వృత్తిలో 16 సంవత్సరాల అనుభవం గడించిన పొందూరి శివప్రసాద్ మిల్లి డిగ్రీ ఎస్టిమేటర్ ఫర్ స్పేస్ సిగ్నల్స్ ఎఫ్ పి జి ఏ అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని ప్రధానం చేశారు. ఈ అంశంపై రాసిన నాలుగు పరిశోధన పత్రాలు పలు అంతర్జాతీయ జనరల్ లోను మరియు అంతర్జాతీయ సదస్సులోనూ సమర్పించబడినవి. ఈ పరిశోధనకు ఎమ్మెస్ రామయ్య ఇంజనీరింగ్ కాలేజ్ బెంగళూర్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న ఆచార్య వి ఆనంది పర్యవేక్షరాలుగా మరియు డాక్టర్ పి.సత్యనారాయణమూర్తి, సహాయ పర్యవేక్షకుడిగా వ్యవహరించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పట్టాను పొందిన పొందూరి శివప్రసాద్ ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ అభినందించారు. తమ కళాశాలలో పీహెచ్ డీ కలిగిన స్టాఫ్ మొత్తం 140 మంది ఉన్నారని తమ కళాశాలలోని అధ్యాపక బృందం చేసే పరిశోధనలకు కళాశాల యాజమాన్యం ప్రోత్సహిస్తుందని కళాశాల సెక్రటరీ రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండప్రోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాల అకాడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, కళాశాల ఫైనాన్స్ డైరెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి శ్రీనివాసరావు మరియు ఈసీఈ విభాగ అధిపతి డాక్టర్ టి రంగబాబు తదితరులు అతన్ని అభినందించారు.

# గుంటూరు పశ్చిమ లో అభివృద్ధికి సహకరించండి

**ఎమ్మెల్యే గళ్ళా మాధవి**
**పురపాలక శాఖ మంత్రి నారాయణ కు విజ్ఞప్తి**
**గుంటూరులో పలు సమస్యలపై మంత్రితో చర్చ**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ఆయనను ఎమ్మెల్యే గళ్ళా మాధవి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులను మరియు ప్రధాన సమస్యలైన రోడ్లు డ్రైనేజీ సమస్యల నివేదికలను మంత్రి నారాయణ ముందు ఉంచారు. గత వైసిపి పాలకుల ధన దోపిడి కారణంగా నగరంలో అభివృద్ధి కుంటుపడిందని , ఒక పనిని ఏళ్ల తరబడి కొనసాగిస్తున్నారని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే గళ్ళ మాధవి తీసుకువెళ్లారు. నగరంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉన్నదని గత సంవత్సరం అనేక డయేరియా కేసులు మరియు మరణాలు సంభవించాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థలను చక్కదిద్దడానికి అవసరమైన అధునాతన మిషిన్లను మరియు పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచటమే మార్గమని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. అదేవిధంగా నగరంలో ఎప్పటినుండో నిలిచిపోయిన పీకల వాగు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు దీనిని మొదటి ప్రాధాన్యత కింద తీసుకొని పీకలవాగుకు మరమ్మత్తుల నిర్వహించి అవసరమైన చోట్ల చెప్టాలు సైడు గోడల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అదే మాదిరిగా నగరంలో వీధికుక్కల బెడద ఉన్నదని మంత్రి దృష్టికి గళ్ళా మాధవి తీసుకెళ్లారు. గళ్ళా మాధవి చెప్పిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.

## దురదృష్టకర రోజులు పోయాయి...

(మొదటిపేజీ తరువాయి)

హీనంగా చూసిందన్నారు. అందుకే తగినమూల్యం చెల్లించు కోవాల్సివచ్చిందన్నారు. ఉద్యోగులు తమ హక్కుల కోసం నిరసన తెలిపిన క్రమంలో 1500 మందికి పైగా ఉద్యోగులపై నమోదైన అక్రమ కేసులను ఎత్తి వేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కి శివా రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు, ఆశా వర్కర్లు, అంగన్వాడి వంటి విభాగాల కార్మికులకు తమకంటే ముందుగానే జీతాల జమ చేయాలని ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ కు విజ్ఞప్తి చేయగా ఈ విషయంలో సానుకూలంగా స్పందించారన్నారు. తక్కువ వేతనంతో బాధ్యతలు నిర్వహిస్తున్న వీరికి ప్రాధాన్యత ఇవ్వటం ప్రభుత్వ ఉద్యోగులుగా తమ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన బకాయిలు చెల్లించేందుకు కొంత సమయం తీసుకున్నప్పటికీ, అత్యవసరమైన వైద్య సేవల విషయంలో మాత్రం ప్రభుత్వం తక్షణం స్పందించి ఉద్యోగులకు అందించే వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ నూతనంగా కొలువైన ప్రభుత్వం గత ప్రభుత్వంలో వివిధ విభాగాలలో జరిగిన అక్రమాలపై శ్వేత పత్రం విడుదల చేస్తున్న విధంగానే ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన సొమ్ములను గత ప్రభుత్వం ఎలా దుర్వినియోగం చేసిందో కూడా వివరించేలా శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. 25 వేల కోట్లకు పైగా డి ఏ, పి ఆర్ సి బకాయిలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలు ఉన్నాయని, వాటి వివరాలు అన్నిటిని ప్రభుత్వం ఒక వాస్తవిక పత్రం ద్వారా తెలియజేయాలని కోరారు. హెల్త్ కార్డులకు మేము కట్టిన డబ్బులు హాస్పిటల్ కి చెల్లించలేదని, అలాగే సిపిఎస్ ఉద్యోగులు జీవితంలో నుంచి రికవరీ చేసిన సొమ్ములు ప్రాన్ అకౌంట్ కి ఎంత కట్టారో ఎంత కట్టలేదో లెక్క కూడా తేలాలని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు ఎదుర్కొన్న ఎన్నో ఇబ్బందులతో పాటు, చాలా సందర్భాలలో గత ప్రభుత్వం ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేయటం అక్రమ కేసులు బనాయించడం వంటి వాటి మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. నిరసన ప్రదర్శనల్లో పాల్గొనని ఉద్యోగులపై కూడా గత ప్రభుత్వం అక్రమ కేసులను బనాయించడం ఉద్యోగ సంఘాలుగా ఎన్నోసార్లు తమ ఆవేదనను తెలియజేసినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజులన్నీ ఉద్యోగులకు శుభకరమైన రోజులేనని భావిస్తున్నామన్నారు. విజయవాడ ఎన్జీవో హోం లో జరిగిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో ఎన్జీవో సంఘ రాష్ట్ర నాయకులు రంగారావు, కృష్ణారెడ్డి, రంజిత్ నాయుడు, క్యాపిటల్ సిటీ కార్యదర్శి సూర్యనారాయణ రెడ్డి, 4వ తరగతి ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల రాష్ట్ర నాయకుడు రామకృష్ణ, పశ్చిమ కృష్ణా కార్యవర్గసభ్యులు డి ఎస్ ఎన్ రెడ్డి , పి.రమేష్, బి. సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ది చేకూరాలంటే.. కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరాలంటే కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరన్నారు. పంట నమోదు చేసుకొనే అవకాశం గుర్తింపు కార్డు వల్ల ఉంటుందని దీని ఆధారంగానే ప్రభుత్వం పంటల భీమా ఇన్ పుట్ సబ్సిడీ వంటి పథకాలను రైతులకు అందించి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తుందన్నారు. సీసీఆర్సీ కార్డు ద్వారా కౌలు రైతులు పంటల భీమా పథకంలో నమోదు చేసుకొనే వీలుందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని సీసీఆర్సీ కార్డుల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 16 మండలాల్లోని 311 గ్రామాలలో 55 వేల 560 కార్డుల పంపిణీ చేయవలసి ఉండగా ఇప్పటివరకు 12 వేల 380 కి పైగా కార్డుల పంపిణీ చేసినట్టు వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరితగతిన నూరు శాతం కార్డుల పంపిణీ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పీఎం కిసాన్) పథకంలో అర్హులైన లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తికావాలన్నారు. ఇప్పటివరకు 8 వేల 497 దరఖాస్తులకు గాను 6 వేల ధరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయగా ఇంకను పెండింగ్ ఉన్న 2 వేల 494 ధరఖాస్తులు పరిశీలన ప్రక్రియ 15 రోజులలోగా పూర్తి చేయాలన్నారు. జగ్గయ్యపేట వీరులపాడు మండలాల్లో 84 శాతం వెరిఫికేషన్ పూర్తికాగా మిగిలిన జిల్లాలలో తక్కువ శాతం పరిశీలన పూర్తికావడంపై వ్యవసాయ శాఖ అధికారులను వివరణ కోరారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా పెట్టుబడి సాయం అందిస్తుందని పథకం లబ్దిని త్వరితగతిన చేకూర్చాలన్నారు. జిల్లాలో ఉద్యానవన శాఖ ద్వారా 43 వేల 563 హెక్టర్లలో కూరగాయలు, పండ్లు, స్పైసెస్, పూల తోటల సాగు జరుగుతుందని వీటిలో మామిడి సాగు ప్రధానంగా జి. కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, తిరువూరు, ఎ-కొండూరు, విస్సన్నపేట, విజయవాడ రూరల్ మండలాల్లో జరుగుతుందని ఆయిల్ పామ్ పంట సాగుకు అవసరమైన సీడింగ్ నర్సరీ రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామంలో ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి కలెక్టర్ కు వివరించారు. వర్షాలు కురుస్తున్నందున ఉద్యాన పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేసి ప్రోత్సహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను కోరారు. మత్స్య శాఖ అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో అర్హులైన లబ్దిదారులకు యూనిట్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ మార్కెట్లో టమాటా ధరలను సమీక్షించుకుని వినియోగదారులకు రైతు బజార్ల ద్వారా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి. బాలాజి కుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.కె.విద్యాసాగర్, సెరీకల్చర్ ఆఫీసర్ ఎన్.సత్యనారాయణ, అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ, మత్స్య శాఖ అధికారి పెద్దిరాజు, డీసీవో పి.శ్రీనాధ్, ఏపీసీ ఎన్ఎఫ్ పీడీ డియంఎఫ్ విజయ కుమారి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు..

## కిడ్నీ రాకెట్ కేసులో ఇద్దరు అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన వ్యక్తికి తన కిడ్నీ ఇస్తే డబ్బులు వస్తాయనే ఆశతో మరియు తన అప్పులు తీరుతాయని ఆలోచన తో ఆ పేజీలో బాధితుడు మెసేజ్ పెట్టినాడు. ఆ తరువాత అదే రోజు ఒక వ్యక్తి ఫోను చేసి ఫేస్ బుక్ మెసెంజర్ సోను కింగ్ అను ఐ.డి ద్వారా ఫిర్యాదికి ఫోను చేసి మధ్యవర్తిని పరిచయం చేయగా, సదరు మధ్యవర్తి ఫిర్యాదితో విజయవాడ కి రమ్మని చెప్పగా, ఫిర్యాది అక్కడకు వెళ్లగా అక్కడ కిడ్నీ పేషెంటు కి సంబంధించిన బంధువులు పరిచయం అయ్యి, కిడ్నీ డొనేట్ చేస్తే 30 లక్షలు ఇస్తామని నమ్మబలికారు, ఫిర్యాదికి సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు తాయారు చేసి, ది. 15.06.2024 వ తేదీన డాక్టర్ ఫిర్యాదికి ఆపరేషన్ చేసి కుడి కిడ్నీ తీసి కేతినేని వెంకట స్వామి అనే వ్యక్తికి మార్పిడి చేసినారు. ఆ తరువాత ఫిర్యాదికి పలు దఫాలుగా రూ. 59500/- ఆన్ లైను ద్వారా పంపి, మరో రూ. 50000/- డబ్బులను ఫిర్యాదికి డిశ్చార్జి సమయంలో చేతికి ఇచ్చి మిగిలిన డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినారని మధుబాబు ఫిర్యాదు చేసినారు. ఈ నేపథ్యంలో నగరంపాలెం యస్.హెచ్.ఓ. మధుసూదనరావు తక్షణమే కేసు నమోదు చేసినారు. ఆ తరువాత వెస్ట్ డి.యస్.పి మహేష్ కేసులో విచారణ చేపట్టి ముద్దాయిలను పట్టుకోటానికి 04 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినారు. రాబడిన సమాచారం మేరకు మంగళవారం జిల్లా కోర్టు రోడ్డులోని సంగం డైరీ వద్ద పైన తెల్పిన ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేయటం జరిగింది. పరారీలో ఉన్న మిగిలిన ముద్దాయిల కోసం గాలింపు కొనసాగుతున్నదని వారిని త్వరలోనే పట్టుకుని కోర్టు కి హాజరు పరుస్తామని డిఎస్పి తెలిపారు.

## గిరి ప్రదక్షణ మహోత్సవాలకు గుంటూరు 2 డిపో నుండి స్పెషల్ హైటెక్ (2ఽ2 )పుష్ బ్యాక్ బస్ ఏర్పాటు

**గుంటూరు సిటీ, జూలై 16(మేజర్ న్యూస్):** అరుణాచలం లో ఏప్రియల్ 23న , పౌర్ణమి సందర్భంగా జరిగే గిరి ప్రదక్షణ మహోత్సవాలకు గుంటూరు 2 డిపో నుండి స్పెషల్ హైటెక్ (2ఽ2 )పుష్ బ్యాక్ బస్ ఏర్పాటు చేసినట్లు డిపో -2 మేనేజర్ షేక్. అబ్దుల్ సలాం మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ బస్ ఏప్రియల్ 21 వ తారీకు రాత్రి 9:15 గుంటూరు లో బయలు దేరి, ఏప్రియల్ 22వ తారీఖున శ్రీకాళహస్తి,కాణిపాకం, శ్రీ పురం గోల్డెన్ టెంపుల్ దర్శించు కొని అదే రోజు రాత్రి అక్కడ నుండి బయలు దేరి పౌర్ణమి రోజున ఏప్రియల్ 23వ తారీఖు ఉదయం అరుణా చలం చేరుకుంటుందని పేర్కొన్నారు. అరుణా చలేశ్వరుని దర్శించు కొని, ఏప్రియల్ 23వ తారీకు సాయంత్రం అరుణాచలం లో బయలు దేరి ఏప్రియల్ 24 వ తారీకు ఉదయం 6:30 గంటలకు గుంటూరు చేరుతాయని ఈ సర్వీస్‌లకు 96164 అనే సర్వీస్ నెంబర్ ద్వారా ఆన్లైన్ రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కల్పించామని స్పష్టం చేశారు.

## సెప్టెంబర్ 28,29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు



**గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్:** స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్, ఆంధ్రప్రదేశ్ నిర్వహించే మాన్యువల్ టైప్ రైటింగ్ పరీక్షలను స్టేట్ టెక్నికల్ బోర్డు సెప్టెంబర్ 28.29 తేదీల్లో టైప్ పరీక్షలను ఇంగ్లీషు, తెలుగు భాషల్లో లోయర్. హైయ్యర్ గ్రేడ్ హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీష్ జూనియర్ గ్రేడ్ పరీక్షను, హిందీ లోయర్, హైయ్యర్ గ్రేడ్ పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా 35కేంద్రాల్లో, తెలుగు ఇంగ్లీష్ షార్టుండ్ పరీక్షలను సెప్టెంబర్ 21.22 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 6కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ టైప్ రైటింగ్ అండ్ షార్టుండ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొనె ప్రతాప్ తెలిపారు. ఆసక్తిగలవారు జూలై 31వ తేదీ లోపల ఇనిస్టిట్యూట్వారిని సంప్రదించి పరీక్ష ఫీజు చెల్లించి, పరీక్షలకు హాజరు కావాలని తెలియజేయుచున్నారు.

## సర్వేలతో ముడిపడిన నామినేటెడ్ పదవులు..!

(మొదటిపేజీ తరువాయి)

ఆశిస్తున్నవారు అధికమయ్యారు. అయితే తాజాగా అధిష్టానం ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధినేతగా ఉన్న సిఎం చంద్రబాబు నామినేటెడ్ పదవుల కోసం ఇదివరకు ఎన్నికల కోసం పార్టీ అభ్యర్థుల ఎంపిక సందర్భంగా జరిపిన సర్వే మాదిరిగానే ఐవి ఆర్ ఎస్ వాయిస్ రికార్డు ద్వారా అభిప్రాయ సేకరణ చేసి అందులో మెజార్టీగా వచ్చిన వారి పేర్లను పరిగణలోకి తీసుకొని నామినేటెడ్ పదవులు ఇవ్వాలని నిర్ణయించడం జరిగినట్లు సమాచారం. దీంతో పలువురు ఆశావాహుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతున్నట్లు చెబుతున్నారు. సాధారణంగా పార్టీకి ఏ విధంగా పనిచేశామో నాయకులకు తెలుసు. తాము ఏ మేరకు పని చేసాము అనేది గుర్తించి తగిన పదవి లభిస్తుందని ఆశించిన వారికి ఈ ఐవి ఆర్ ఎస్ సర్వే అంటూ మెలిక పెట్టడం ఏమిటని వాపోతున్నారని తెలుస్తోంది. ఇక బీజేపీ, జనసేన నాయకుల సంగతి ఏమిటి అనేది స్పష్టం చేయలేదు. ఆ పార్టీలకు సంబంధించిన నాయకులు కూడా నామినేటెడ్ పదవులకు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. కాగా నామినేటెడ్ పదవులకు సంబంధించి రాష్ట్ర, జిల్లా అదేవిధంగా మండల స్థాయిలో ఆయా విభాగాలకు సంబంధించి నామినేటెడ్ పదవులు ఉన్నాయి. రాష్ట్ర స్థాయి పదవులు నియోజకవర్గంలోని మొదటి శ్రేణి నాయకులకు జిల్లా, మండల స్థాయి పదవులకు ద్వితీయ శ్రేణి నాయకులకు ఇచ్చే అవకాశం ఉండటున్నారు. ఇది ఇలా ఉండగా నియోజకవర్గానికి పదుమంది లోపు పేర్లను సిద్ధం చేసి అధిష్టానానికి జాబితాను పంపాలనే ఆదేశాలు అధిష్టానం నుంచి ఆయా జిల్లాలకు వచ్చినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఇప్పటికే అధిష్టానం సైతం ఐవి ఆర్ ఎస్ సర్వే చేపట్టి అభిప్రాయ సేకరణ చేస్తోందని తెలిసింది. దీనికి సంబంధించి ఇప్పటికే పలువురికి ఫోన్ కాల్స్ వచ్చినట్లు సమాచారం.

వాస్తవానికి నామినేటెడ్ పదవుల నియామకం విషయంలో స్థానిక ఎమ్మెల్యే లు సూచించిన వారికే అధిక ప్రాధాన్యత ఉంటుందనేది ఇదివరకు అందరూ భావిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు ఎమ్మెల్యే లకు దగ్గరగా ఉంటూ వస్తున్నారు. తాజాగా ఐవి ఆర్ ఎస్ సర్వే పేరును ముడి పెట్టడంతో చాలా వరకు ఆశావాహులు డైలమాలో పడిపోయారు. ఏదేమైనా నామినేటెడ్ పదవులకు సర్వే పేరుతో ముడి పెట్టడం సరైంది కాదనే అభిప్రాయం. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మెజార్టీ టిడిపి నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారనేది వాస్తవం. ఇక ఐవి ఆర్ ఎస్ సర్వే వల్ల ఇబ్బందులు ఏమి ఉండవని స్థానిక ఎమ్మెల్యే లను దాటి నామినేటెడ్ పదవులు ఎక్కడికి పోవని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా నామినేటెడ్ పదవులపై ఐవి ఆర్ ఎస్ కాల్స్ ప్రభావితం చేస్తాయా..? లేదా ఎమ్మెల్యే ల సిఫార్సులు పని చేస్తాయో వేచి చూడాల్సిందే.

# నేడే కొండ పండగ

**తొలి ఏకాదశికి అన్ని ఏర్పాట్లు పూర్తి**

**కొండపై పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జీవి**



**వినుకొండ, మేజర్ న్యూస్ :** వినుకొండ కొండపై వేంచేసి ఉన్న గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి తొలి ఏకాదశి తిరునాళ్ల బుధవారం ఘనంగా జరగనుంది. దీనిలో భాగంగా వినుకొండ మునిసిపల్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు భక్తుల సౌకర్యం తగిన ఏర్పాటు చేస్తున్నారు.వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం కొండపై జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు నలభై వేల వరకు భక్తులు పై కొండకు వచ్చే అవకాశం ఉందని భావించి భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.దేవాలయం నిర్మాణంలో ఉండడం వలన ఆలయంలోని, ఉత్సవ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు.ఘాట్ రోడ్డుకు బారీ గేట్స్,కొండపై ఆలయం వద్ద క్యూలైన్లు,ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు,స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారని వివరించారు.శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్న కొండపై భక్తులకు అన్నప్రసాదాలు,మంచినీటి స్టాల్స్ ను ఏర్పాటు చేశామని తెలిపారు.కొండపై టాయిలెట్స్ మెడికల్ క్యాంపులు అధికారులు ఏర్పాటు చేశారని తెలిపారు.తొలి ఏకాదశి పండుగ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలు దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అలాగే హిమాలయ గురుజి బుధవారం సాయంత్రం ఆరుగంటల ముప్పై నిమిషాలకు అఖండ జ్యోతి కార్యక్రమం నిర్వహిస్తారని,భక్తులు వేలాదిగా హాజరై అఖండ జ్యోతి దర్శించుకోవాలని ఆయన కోరారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు,మిన్సిపల్ చైర్మన్ దస్తగిరి,నియోజకవర్గ జనసేన ఇంచార్జ్నాగ శ్రీను రాయల్,ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన నాయకులుని శంకర శ్రీనివాసరావు,కౌన్సిలర్ వాయిస్ రెడ్డి లింగమూర్తి,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# విన్నకొండ నుండి వినుకొండ



**వినుకొండ, మేజర్ న్యూస్ :** వినుకొండకు ఆపేరు ఎలా వచ్చిందో తెలియజేయుటకు చిత్రకారుడు బి ప్రసాద్ రావు మంగళవారం చిత్రము గీసి తెలియజేసారు.రామాయణంలో రాముడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు రాముడు లేని సమయమున రావణాసురుడు మారువేషంలో వచ్చి సీతమ్మ తల్లిని అపహరించుకొని తీసుకెళ్లాడు.శ్రీరామునికి ఆ విషయం తెలియక తిరుగుతూ మన వినుకొండకు వచాడని పురాణాలు చెపుతున్నాయి. అప్పుడు వినుకొండ పెద్ద అరణ్యం ఇక్కడకు రాగానే రామా రామా రామా అని అరుపులు వినిపిస్తాయి.అప్పుడు శ్రీరాముడు కొండపైకి వెళ్లి చూడగానే గరుట్మంతుడు రావనాసురుని బానాలవలన రెక్కలు తెగి శరీరము రక్త సక్తమై రోదిస్తూ ఉంది.అప్పుడు శ్రీరాముడు దానిని ఓదార్చి ఏమని అడగగా రావణాసురుడు సీతమ్మ తల్లిని తీసుకొని వెళుతుండగా నేను అడ్డగించి యుద్ధం చేయగా దాని ఫలితమే ఈ దుస్థితి అని తెలియజేసాధాని పురాణాలు చెపుతున్నాయి. అప్పటివరకు సీత అపహరణకు గురైనట్లు రాముడికి తెలియదు అంటారు.జటాయువు ద్వారా విన్నాడు కనుక అప్పటి నుంచి విన్న కొండ అని పేరు వచ్చింది అంటారు.క్రమేపి అది వినుకొండ గా మారింది.ఈ విషయం ప్రజలకు తెలియజేయాలని చెప్పడం కోసం చిత్రకారుడు ప్రసాద్ రావు చిత్రం ద్వారా తెలియజేశారు.ఒక్క రోజు లో ఈ చిత్రం వేయడం జరిగింది అని ఆయన అన్నారు.ఇది నా ప్రయత్నమని ప్రజలు తెలుసుకొని నన్ను ఆశీర్వదిస్తారని ఆయన కోరారు.

# వసతి గృహ విద్యార్థులకు మంచి భోజనం ఇవ్వాలి





- ఉత్తీర్ణత శాతాన్ని శాతాన్ని పెంచాలి
- సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

సాంఘిక సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మంచి మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులకు తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పై వుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. మంగళవారం ఉదయం తాడికొండ లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మరియు బిసి బాలికల వసతి గృహాలను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట గది డైనింగ్ హాల్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థులకు అందించే అల్పాహారం, భోజనం మెనూ ప్రకారం రుచిగా, సుచిగా అందించాలన్నారు. తరగతి గదులను పరిశీలించి వారికి అందిస్తున్న విద్యాభోదన పై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో మమేకమై జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయురాలిగా మారి కొంత సమయం వారితో ముచ్చటించారు. ఇంగ్లీష్ పాఠ్య పుస్తకం చదవడం లో విద్యార్ధికి వున్న ప్రతిభను పరీక్షించారు. విద్యార్థులకు రోజు వారీగా పాఠ్య పుస్తకంలోని పాఠాన్ని చదివించాలని, అలాంటప్పుడే విద్యార్థులు మంచి తర్ఫీదు పొందగలరని ఉపాధ్యాలకు జిల్లా కలెక్టర్ సూచించారు. పాఠ్య పుస్తకాన్ని చదవడం లోనే విద్యార్థులు ఇబ్బందులు పడితే, ఆ పాఠాన్ని వారు అర్థం చేసుకొని పరీక్షలను ఎలా ఎదుర్కొగలరని జిల్లా కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో స్టాండర్డ్ పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సివుందని సూచించారు. అనంతరం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో వారికి లెక్కల పై ఏ మాత్రం అవగాహన వుందో తెలుసుకోవడానికి వారిని పరీక్షించారు. ఇంతకు క్రితమే అభ్యాసం పూర్తైన లెక్కల చాప్టర్ నుండి బోర్డ్ పై లెక్కను వ్రాసి పరిష్కరించాల్సిందిగా విద్యార్థులను కొరడం జరిగింది. విద్యార్థులు లెక్క పరిష్కారంలో తడబాటు పడటం చూసి విద్యార్థులకు మరింతగా తర్ఫీదు ఇవ్వాలని గణిత ఉపాధ్యాయునికి సూచించారు. విద్యార్థులు ఏఏ సబ్జెక్ట్ లలో వెనుకబడి వున్నారో గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అందించాలన్నారు. బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణంలో నిల్వ వున్న వర్షపు నీటిలో లార్వ పెరగకుండా వుండేందుకు ఆయిల్ బాల్స్, యాంటీ మలేరియా మందులు వేసి మలేరియా వంటి జబ్బులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పరిసర ప్రాంతాలలో ఫాగింగ్ చేయాలని పంచాయతీ సెక్రెటరీని ఆదేశించారు. విద్యార్థులు బస చేసే గదులను, టాయిలెట్లను పరిశీలించి, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బస చేసే గదుల్లోకి దోమలు, ఈగలు వంటి కీటకాలు ప్రవేశించకుండా వుండేందుకు కిటికిలకు మెష్ లను వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం బిసి బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. వసతి గృహం లోని విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న ఆహారం ఎలా వుందని, సమయానికి ఆహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. వంట గదిని పరిశీలించి మరింత శుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహం నుండి బయటకు వెళ్ళే డ్రైనేజి వ్యవస్థ సరిగ్గా లేదని వసతి గృహం అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా డ్రైనేజిని బాగు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఈఓ పిఆర్డి వెంకటేశ్వర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహంలో మరింతగా పారిశుద్ద్యం పనులు చేపట్టి విద్యార్థినీలకు సౌకర్యవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ వసతి గృహాల తనిఖీలో జిల్లా కలెక్టర్ తో పాటు డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదన్, తాడికొండ తహశీల్దార్ మధుసూధన రావు, మండల ప్రత్యేక అధికారి మరియు పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు సుధాకర్, గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీమతి కె.పద్మజ, సమగ్ర శిక్ష అడిషనల్ కో–ఆర్డినేటర్ జి.విజయ లక్ష్మీ, మండల విద్యా శాఖ అధికారిణి ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# బొప్పూడిలో వైభవంగా తొలి ఏకాదశి ఏర్పాట్లు





**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** విశిష్ఠమైన తొలి ఏకాదశిని పురస్కరించుకుని చిలకలూరిపేట మండలం బొప్పూడి కొండపై ఉన్న శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేడుకల నిర్వహణకు వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే ఏకాదశి, విష్ణుమూర్తికి ఎంతో ప్రీతికరమైన బుధవారం రోజు రావడంతో ఈ పర్వదినాన్ని మరెంతో ప్రత్యేకంగా భావిస్తూ సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు, మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. జస్టిస్ బి.కృష్ణమోహన్ స్వగ్రామం బొప్పూడిలో వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు గ్రామంలోని ఆలయాలకు జస్టిస్ కుటుంబం వంశపారంపర్య ధర్మకర్తలుగా ఉన్నారు. ఈ సందర్భంగా అర్చక బృందం వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. ఏటా బొప్పూడి కొండపై తొలి ఏకాదశి సందర్భంగా తిరునాళ్లు నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం కొండపై కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం నిర్వహించారు. ఈ హోమంలో ఏపీ జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొన్నారు. అంతకు ముందు కొండపై ఉన్న ఆలయంలో కల్యాణ వెంకటేశ్వరస్వామికి జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు, ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. తొలి ఏకాదశి పర్వదినం ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అంతకు ముందు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్‌ను ఆయన నివాసంలో ప్రత్తిపాటి పుల్లారావు మర్యాద పూర్వకంగా కలిశారు. జస్టిస్ దంపతులను శాలువాతో సత్కరించారు.

# రాష్ట్రంలో మొదలైన ప్రజా పరిపాలన

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జగన్ ప్రభుత్వం తెచ్చిన అత్యంత వివాదాస్పదమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. నాడు ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయని అన్నారు. జగన్ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే అమలును నిలిపేయడంతో పాటు... ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ ప్రివెన్షన్ యాక్ట్‌ను త్వరలోనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో కబ్జాదారుల్లో గుబులు మొదలైందన్నారు. గత ఐదేళ్లుగా జగన్ చేపట్టిన వ్యవస్థల విధ్వంసాన్ని చంద్రబాబు చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారని, అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకుంటూనే... ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల మేరకు ఒక్కొక్క హామీని చంద్రబాబు ప్రభుత్వం అమలు



చేస్తుందన్నారు. కానీ కొంతమంది వైసీపీ నాయకులు మాత్రం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై దుష్ప్రచారం చేస్తూ లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే రాష్ట్రంలో ఇసుక సరఫరా నిలిపివేయడంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. వైసీపీ మొదటి ఆరు నెలల పాలనలో విధ్వంసం, కూల్చివేత పర్వాలు, కార్మికుల ఆత్మహత్యలు, కాంట్రాక్టు రద్దులు, కక్షసాధింపు తప్ప ఏం లేదన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి నెలరోజుల్లోనే తొలిఐదు సంతకాలు అమలు చేసి సంచలనం సృష్టించారని, ఆగష్టు 15 నుంచి అన్నక్యాంటీన్ల పునరుద్ధరణతో పాటు, మహిళలకు

- జగన్ సృష్టించి విధ్వంసం నుంచి బయటపడుతున్న ఏపీ
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షణీయం
- వచ్చే నెలలో మరో రెండు కీలక హామీల అమలుకు శ్రీకారం చుట్టడం హర్షణీయం మన్నవ మోహనకృష్ణ

ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి పథకాలు అమలులోకి రాబోతున్నాయని తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అర్హులైన వారికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఇంటింటికి త్రాగునీటి సరఫరా వంటి పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుందన్నారు. రెండునెలల పరిపాలన కూడా పూర్తి చేసుకోని ప్రభుత్వంపై వైసీపీ నాయకులు ఆరోపణలు చేయడం దుర్మార్గమని, ప్రజా పరిపాలన ఇప్పుడే మొదలైందని నెల రోజుల్లోనే అద్భుతాలు జరిగిపోవనే విషయాన్ని గుర్తించుకోవాలని మన్నవ మోహనకృష్ణ హితవు పలికారు.

## ఎమ్మార్వో సంతకాల ఫోర్జరీ వ్యవహారంలో నిందితుడిపై కేసు నమోదు..



**దాచేపల్లి, మేజర్ న్యూస్ :** మండలం గత కొన్ని రోజులుగా వార్తాపత్రికల్లో ఎమ్మార్వో సంతకాల ఫోర్జరీ అని వస్తున్న వార్తల అంశంపై విలేకరుల సమావేశం నిర్వహించిన దాచేపల్లి మండల తహసిల్దార్ గీతావాణి ఈ సందర్భంగా ఏం.ఆర్.ఓ మాట్లాడుతూ మాదినపాడు గ్రామానికి చెందిన వీఆర్వో సైద్ హుస్సేన్ కుమారుడు షేక్ నాగుల్ మీరా తహసిల్దార్ ఆఫీస్ నకిలీ స్టాంపులు తాసిల్దార్ సంతకాలు ఫోటోషాప్ ఫోర్జరీ చేస్తూ ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నాడని గతంలో కూడా రైతులకు రుణాలు ఇప్పిస్తానంటూ జీ.డి.సి.సి బ్యాంకులో ఎమ్మార్వో సంతకాలు ఫోర్జరీ చేస్తున్నాడని తమ దృష్టికి రావడంతో నాగుల్ మీరాపై పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశామని దీనిపై పలనాడు జిల్లా కలెక్టర్కు ఎస్పీకు కూడా ఫిర్యాదు చేశామని ఆమె తెలిపారు. ప్రజలు ఎవరూ కూడా ఇలాంటి మోసగాళ్ళని నమ్మి నష్టపోవద్దని దాచేపల్లి మండల తహసిల్దార్ గీతావాణి తెలిపారు. పోలీసులు నాగులు మీరా పై ఐపీసీ 465, 468, 471 క్రింద కేసు నమోదు చేసి నిందితుడు నాగుల్ మీరా కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీవీ



**వినుకొండ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని విష్ణుకుండి నగర్ నందు డ్రైనేజీ నిర్మాణం పనులకు మంగళవారం ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ వినుకొండ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేం దుకు మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్య క్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ముప్పై రెండవ వార్డు ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు వార్డ్ కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వార్డు ప్రజలు పడుతున్న అవస్థలపై కౌన్సిల్లో చర్చించి అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళటలో కౌన్సిలర్ లింగమూర్తి చూపిన చొరవను ఆయన కొనియాడారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కమిషనర్ తోట కృష్ణవేణి, డిఈ వెంకయ్య, టిడిపి నాయకులు పివి సురేష్ బాబు, ఆయుబ్ ఖాన్, విష్ణు కుండి నగర్ పార్టీ అధ్యక్షులు చిరుమామిళ్ల కోటేశ్వరావు, 32వ వార్డు ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై భగ్గుమన్న జర్నలిస్టులు

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** రాజ్యసభ సభ్యుడు, వైసీపీ కీలక నేత విజయసాయిరెడ్డిపై దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి భర్త మదన్మోహన్ తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై స్పందించేందుకు విజయవాడలో సోమవారం మీడియా ముందుకు వచ్చిన విజయసాయిరెడ్డి జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం సత్తెనపల్లి నియోజకవర్గ జర్నలిస్టులు విజయ సాయిరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి చెప్పుల దండ వేసి ఊరేగించారు. పట్టణంలోని తాలూకా సెంటర్ వద్ద



నుండి నిరసనగా ర్యాలీ చేశారు. అనంతరం మండల తహశీల్దార్ కు విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛను హరించే విధంగా ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడటం భావ్యం కాదని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని

- ఎంపీ చిత్రపటానికి చెప్పులదండతో ఊరేగింపు
- చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

హెచ్చరించారు. గౌరవమైన పదవిలో ఉంటూ తనపై వచ్చిన ఆరోపణలకు స్పందించి తన నిజాయితీని నిరూపించుకోవాల్సినటువంటి బాధ్యత విజయసాయిరెడ్డిపై ఉందని గుర్తు చేశారు. జర్నలిస్టులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీలు స్వచ్ఛంద సంఘాల నాయకులు పాల్గొని జర్నలిస్టులకు మద్దతు తెలిపారు.

## నవతరం పార్టీ ప్రజావారధి సద్వినియోగం చేసుకోవాలి

### ప్రజలకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పిలుపు



**చిలకలూరిపేట, మేజర్‌న్యూస్ :** చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలో అభివృద్ధికి సమన్వయము చేసుకుంటూ పనిచేస్తామని, నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం చేపట్టిన ప్రజావారధి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుంది అని అయన తెలిపారు. ప్రత్తిపాటి పుల్లారావు క్యాంపు ఆఫీస్‌లో నేడు జరిగిన కార్యక్రమంలో శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బిజెపి నియోజకవర్గం కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త తోట రాజా రమేష్, నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. కార్యక్రమంలో బిజెపినేత మల్లెల శివ నాగేశ్వరావు, జనసేన పార్టీ నేతలు బిజెపి, నవతరం పార్టీ నేతలు పాల్గొన్నారు.

## స్వచ్ఛత పరిశుభ్రత




**వినుకొండ, మేజర్ న్యూస్ :** పట్టణం లోని ఎన్ఎస్పి కాలువ నందు స్వచ్ఛత పరిశుభ్రత శ్రమదాన కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు మంగళవారం. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ శుభ్రంగా ఉండాలని సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు, జనసేన ఇంచార్జ్ నాగ శ్రీను రాయల్, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన నాయకులు నిస్సంకర్రావు శ్రీనివాసరావు పాల్గొని చీపుర్లు పట్టుకుని బజార్లు చీపుర్లు పట్టుకొని కాలువలోని చెత్తను క్లీన్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మదమంచిపాడుకి పాదయాత్ర





**వినుకొండ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, నియోజకవర్గం నుంచి జీవి ఆంజనేయులు భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా పట్టణం లోని పదకొండో వార్డు రైలు పేట నుండి మదమంచి పాడు ఆంజనేయస్వామి దేవస్థానం వరకు టీడీపీ నాయకులు మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రని తెలుగుదేశం నాయకుడు మునయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పాదయాత్ర కార్యక్రమాన్ని నియోజకవర్గ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావులు జండావూపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ జనసేన ఇన్చార్జ్ నాగ శ్రీను రాయల్, నాయకులు వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## దొడ్లేరు మార్గంలో నరక ప్రయాణమే



**క్రోసూరు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన క్రోసూరు నుండి దొడ్లేరు గ్రామానికి వెళ్లే రహదారి పెద్ద పెద్ద గుంతలతో నరక ప్రయాణం తలపిస్తుంది.. రెండ్రోజుల కితం కురిసిన వర్షానికి సదరు గుంతలు తటాకాలగా మారాయి.. సదరు మార్గంలో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు

## నేడు దొడ్లేరులో ఎమ్మెల్యే ప్రవీణ్ పర్యటన

**క్రోసూరు, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీ నాయకులకు కార్యకర్తలందరు బుధవారం ఉదయం క్రోసూరు మండలం లోని దొడ్లేరు గ్రామంలో జరుగు మోహరం పండుగ వేడుకల్లో పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ గారు పాల్గొంటారని మండల టీడీపీ నాయకులు మొఘల్ జాను తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మండల కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కాగలరని కోరారు.

## జనసేన క్రియాశీల సభ్యత్వాన్ని విజయవంతం చేయాలి

### జనసేన పార్టీ సమన్వయకర్త తోట రాజ రమేష్

**చిలకలూరిపేట, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ అన్నారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ రమేష్ మాట్లాడుతూ మూడు విడతలుగా విజయవంతమైన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియ నాలుగో విడతగా ఈనెల 18వ తేదీన మొదలై 28వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. గతంలో క్రియాశీల సభ్యత్వం తీసుకున్న వారు కూడా రెన్యువల్ చేసుకోవాల్సిందిగా కోరారు. క్రియాశీలక సభ్యత్వానికి కావలసినవి ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఫోన్ నెంబర్, 500 రూపాయల నగదు అన్నారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడం వలన రూ. 5 లక్షల వరకు ప్రమాద బీమా, రూ. 50 వేల వరకు ప్రమాద సమయంలో వైద్య ఖర్చుల బీమా, జనసేన పార్టీ ఏర్పాటు చేయబోయే కమిటీలలో ప్రాధాన్యత ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. నాలుగవ విడత లోను బలమైన స్ఫూర్తితో జనసేన నాయకులు జనసైనికులు వీర మహిళలు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో సమిష్టిగా ముందుకు తీసుకువెళ్లి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏఎన్ఎంలకు స్టాప్ డయేరియాపై అవగాహన



**కారంపూడి, మేజర్ న్యూస్ :** ఈరోజు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఏఎన్ఎం లకు స్టాప్ డయేరియా మరియు పంచాయతీరాజ్ యాప్‌ల గురించి అవగాహన మీటింగ్ ఏర్పాటు చేయడమైనది. ఈ యొక్క సమావేశంలో ఈవో పి ఆర్ అండ్ ఆర్డి సత్య ప్రసాద్ మాట్లాడుతూ సీజనల్గా వచ్చే వ్యాధులలో అతిసారవ్యాధి ఒకటిని దీనిని అరికట్టాలంటే ముఖ్యంగా 5 సూత్రాలను పాటించాలని, ఒకటి పబ్లిక్ ప్రదేశాలలో చెత్తాచెదారాన్ని గుర్తించి దాన్ని తొలగించి శానిటేషన్ చేయాలని రెండు సైడ్ కాలువలలో మురుగు గుర్తించి పూడిక తీయాలని, మూడు పబ్లిక్ వాటర్ ట్యాంకులు బోర్లలో నీటి నమూనాలు సేకరించాలని, నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులలో ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని, క్లోరినేషన్ తేదీలను ఆయా వాటర్ హెడ్ ట్యాంకుల దగ్గర డిస్ప్లే చేయాలని, 5 . ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని త్రాగే విధంగా ప్రచారం చేయాలని అదేవిధంగా రేపు తొలి ఏకాదశి మొహరం పండుగల సందర్భంగా ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు బ్లీచింగ్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు,ఇందులో భాగంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పి ఆర్ వన్ యాప్ ని చేయాలని ఓడిఎఫ్ ప్లస్ సర్వే సకాలంలో చేయాలని. సూచించారు. ఈ సమావేశంలో మండల స్వచ్ఛభారత్, ఆర్డబ్ల్యూఎస్ అండ్ ఎస్ కోఆర్డినేటర్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు రాజు, చెన్నకేశవరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లింగయ్య, లాలు, వెంకట నరసయ్య, సత్యనారాయణ రాజు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# ఆటోనగర్ పూర్తి చేసి చిలకలూరిపేటకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాం





- ఏపీఐఐసీ అధికారులతో కలిసి ఆటోనగర్‌ను పరిశీలన
- బుధవారం సాగర్ కుడి కాల్వ ద్వారా తాగునీటికి 5టీఎంసీల విడుదల
- సోమ లేదా మంగళవారానికి చిలకలూరిపేట చెరువుకు సాగర్ జలాలు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయిన ఆటోనగర్‌ను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి చిలకలూరిపేటకే ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తామని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. సకల సౌకర్యాలతో త్వరలోనే లబ్ధిదారులకు అక్కడ కేటాయించిన ప్లాట్లు కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. చిలకలూరిపేట మండలం పోతవరం వద్ద ఆటోనగర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. తెదేపా గత ప్రభుత్వం 2016లోనే ఈ ఆటోనగర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు చేపట్టామని, ఆటోమొబైల్స్ యూనిట్ల ఏర్పాటుకు ఏపీఐఐసీ 42.30 ఎకరాల భూమి కూడా కేటాయించిందన్నారు ప్రత్తిపాటి. నాడు రూ.50 కోట్లతో తొలిదశలో రహదారులు, విద్యుత్ స్తంభాలు, అంతర్గత మురుగు కాల్వలు పూర్తి చేసినా 2019లో ప్రభుత్వం మారడంతో ఆ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆటోనగర్ పనులు తిరిగి పట్టాలెక్కించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఏపీఐఐసీ డీజడ్ఎం జీవన్, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డీజడ్ఎం దొరబాబుతో చర్చించారాయన. ఆటోనగర్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఫేజ్-1, ఫేజ్-2లను కలిపి మధ్యలో ఉన్న భూముల రైతులు ముందుకొస్తే వాటిని కూడా అభివృద్ధి చేయాలని, గత పాలకుల్లా ఎవరిపై ఒత్తిడి మాత్రం చేయమని ఈ సందర్భంగా ప్రత్తిపాటి తెలిపారు. నాడు తొలి దశ పనులతో పాటు లబ్ధిదారులను కూడా ఎంపిక చేశామన్నారు. కానీ తర్వాత ఈ ఆటోనగర్‌కే కాదు ఇంకొక ఆటోనగర్‌కు కూడా స్థలం ఇస్తామని చెప్పిన వైకాపా అవన్నీ మరిచిపోయి ప్రజల్ని మోసం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం మారడంతో ఇంతకాలానికి ఆ గ్రహణం వీడిందన్నారు. టాటా, మహీంద్రా కంపెనీల తరహా జీపులు తయారుచేసే శక్తి సామర్థ్యాలు ఉన్న కార్మికులు ఇక్కడ ఉన్నారన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఆటోనగర్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేశారో వారికే తెలియాల్ననారు. ఎంఎస్ఎంఈలో ఏమైతే ప్రయోజనాలు ఉన్నాయో వాటితో పాటు ఏపీఐఐసీ ద్వారా వచ్చే ప్రయోజనాలను తీసుకుంటామని వివరించారు. ఇక్కడి కార్మికుల్లో ఎక్కువమంది పేదలు, ముస్లిం మైనార్టీలు ఉన్నారన్నారు. వారందరికీ అనువుగా ఉంటే తప్ప ఇక్కడికి రారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లి ఎంతమేరకు వారికి రాయితీలు ఇప్పించాలో అంత ఇప్పిస్తామన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా స్టేట్ జీఎస్టీ 9% ఐదేళ్లు ఉచితంగా ఇప్పిస్తామంటున్నారని తెలిపారు. ఐదేళ్లు రాయితీ ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రాయితీ, అభివృద్ధి కూడా చేయాల్సి ఉందన్నారు. ఎంఎస్ఎంఈలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం వరకు రాయితీ వస్తుందన్నారు. 3 శాతం వడ్డీ రాయితీలు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఎంఎస్ఎంఈ, ఏపీఐఐసీ, రాష్ట్ర ప్రభుత్వం అయితే 25 పైసలకే రుణాలు ఇప్పించే సౌకర్యం ఉందని ఏపీఐఐసీ అధికారులు చెప్పారన్నారు ప్రత్తిపాటి. విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కు రూపాయి తగ్గించే సౌకర్యం కూడా ఉందని చెప్పారని, ఏది ఏమైనా రాయితీలు ఎక్కువ ఉంటే తప్ప ఈ ఆటోనగర్ ముందుకు వెళ్లే అవకాశం లేదన్నారు. ధర కూడా తగ్గించమని చెబుతున్నారన్నారు. గతంలో స్క్వేర్ మీటర్ రూ.1096 పెట్టారని, కానీ ఆ ధర ఎక్కువగా ఉందని చెబుతున్నారని, కాబట్టి వీటన్నింటిపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడిన తర్వాత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చిలకలూరిపేట ఆటోనగర్ ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఆయనకు వివరించి ఏవిధంగా రాయితీలు కల్పించాలో చర్చిస్తామన్నారు. ఈ ఆటోనగర్‌లో మొత్తం 42.30 ఎకరాల్లో 613 ప్లాట్‌లు ఉన్నాయన్నారు. 613 మంది కార్మికులకు ఇవ్వొచ్చని తెలిపారు. ఏదైనా పెద్ద షెడ్డు నిర్మాణం చేసుకోవాలంటే 2, 3ప్లాట్‌లు కూడా తీసుకోవచ్చన్నారు. దానికి అనుగుణంగా యూనియన్ బ్యాంకు కూడా సిద్ధంగా ఉందన్నారు. నెల రోజుల్లో దీనికి ఒక కార్యాచరణ, కార్యరూపం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో కొందరు ప్లాట్‌ల కోసం డబ్బులు కట్టి వెనక్కి తీసుకున్నారని, ప్రస్తుతం వారి ఆలోచనలు ఏవిధంగా ఉన్నాయో పరిగణనలోకి తీసుకుంటాం అన్నారు. మొత్తం మీద ఆటోనగర్ ఏర్పాటుతో చిలకలూరిపేటను ప్రత్యేక స్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమన్నారు ప్రత్తిపాటి పుల్లారావు. తాగునీటి అవసరాల దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే సాగర్ కుడి కాల్వ ద్వారా 5 టీఎంసీలను విడుదల చేయాలని ఆదేశించారని ప్రత్తిపాటి తెలిపారు. చిలకలూరిపేట చెరువులను పరిశీలించిన తర్వాత ఇదే విషయమై నిన్న జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడినట్లు చెప్పారు. బుధవారం సాగర్ కుడి కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తారని, సోమ లేదా మంగళవారానికి చిలకలూరిపేట చెరువుకు జలాలు చేరే అవకాశం ఉందన్నారు. దానికి తగిన విధంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించామన్నారు. నిన్న రాత్రి నుంచే పట్టణానికి నీటి సరఫరాను పెంచాలని సూచించామన్నారు. గత పాలకుల తప్పిదాల వల్లనే నెల రోజులుగా పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. రాబోయే 15 రోజుల తర్వాత చిలకలూరిపేట మంచినీటి సమస్య కూడా పరిష్కారం కాబోతుందన్నారు.

# శ్వేతపత్రంలో వెల్లడైన వైసీపీ భూకబ్జాల భాగోతం

- భూకబ్జా బాధితులకు భరోసాపై హర్షం
- జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి



**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** దోచుకోవటం, దాచుకోవటమే జగన్ నైజమని, ఆయన హయంలో జరిగిన అభివృద్ధి శూన్యమని జనసేన సెంట్రెల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలాజి మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాలతో జగన్ పారిపాలన కాలంలో కొనసాగిన అవినీతి బట్టబయలౌతుందని ఎర్కొన్నారు. వైసీపీ నేతలు భూములు, సహజవనరులను అడ్డగోలుగా దోచేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో సహజవనరుల దోపిడీ'పై సీఎం శ్వేతపత్రంలో అడ్డగోలు దోపిడి బయట పడతుంటే అవినీతికి పాల్పడ్డ వైసీపీ నేతల్లో అలజడి మొదలైందన్నారు.

**జగనన్న కాలనీలంటూ వేలకోట్లు నొక్కేశారు**

వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో తీవ్రమైన అవినీతి చోటు చేసుకుందని బాలాజి అరోపించారు. పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 10 వేల ఎకరాలను బలవంతంగా లాక్కున్నారని వెల్లడించారు. .వైసీపీ నాయకులు ముందుగానే భూములను తక్కువ ధరకు కొనేసి, రెండింతల ధరకు ప్రభుత్వానికి విక్రయించారని . ఆ భూములు ఇళ్ల స్థలాలకు పనికిరావని తెలిసినా పేదలకు కేటాయించారని, ఆ భూముల లెవెలింగ్ పేరుతోనూ దోచుకున్నారని విమర్శించారు. ఇదే తరహాలో చిలకలూరిపేట నియోజకవర్గంలోనూ మాజీ మంత్రి విడదల రజిని తీవ్రమైన అవినీతికి పాల్పడ్డారని, ఈ విషయంపై రైతులు కూటమి ప్రభుత్వంలో గళమెత్తితే కొంతనగదు వెనుక్కు ఇచ్చారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం పంచభూతాలను సైతం మింగేసిందని, భూములు, గనులు, ఎర్రచందనం, అటవీ సంపదను భారీ ఎత్తున దోచేసిందని విచారణలో వెల్లడిందన్నారు.

**భూకబ్జా బాధితులకు భరోసా..**

గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు లాక్కున్న భూములను తిరిగి బాధితులకు అప్పగిస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించటం పట్ల బాలాజి హర్షం వ్యక్తం చేశారు. ఇందువల్ల వేలాది మంది పేద రైతులకు మేలు జరగనుందన్నారు. సీఎం భూ కబ్జాల వివరాలు ప్రభుత్వానికి తెలియజేస్తే వాటికి రక్షణ కల్పిస్తామన్నారని, అవసరమైతే న్యాయపోరాటం చేసి, బాధితులకు సాంత్వన చేకూరుస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

# గ్రామాల సుస్థిర అభివృద్ధికి నిర్మాణాత్మక ప్రణాళికకు కృషి

## గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మేజర్ న్యూస్ : పెదకూరపాడు ప్రగతికి బాటలు పరుస్తామని ఒక నిర్మాణాత్మకమైన ప్రణాళికతో గ్రామ సుస్థిర అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడులో ఎమ్మెల్యే మంగళ వారం పర్యటించారు. నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్ ను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయల నిర్మాణానికి సామాజిక అవసరాలకు వినియోగించు కోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అర్తిమల్ల రమేష్ , గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు ఎమ్మెల్యేని కోరారు. అనంతరం 42 లక్షలతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్మించి వైకాపా పాలనలో నిర్లక్ష్యా నికి గురైై నిరుపయోగంగా మారిన పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ ను పరిశీలించారు. తాత్కాలిక మరమ్మ తులు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. రాబోయే రోజుల్లో కార్యాలయంలో



అందుబాటులో ఉండి మండల ప్రజల సమస్యలు పరిష్కారిస్తామన్నారు. నిర్లక్ష్యానికి గురైన విలేజ్ పార్క్, తాగునీటి చెరువుపై వాకింగ్ ట్రాక్ ని పరిశీలించి అభివృద్ధి చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దాత సమకూర్చిన స్థలంలో సబ్ రిజిస్టార్ కార్యాలయం నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ సహకారంతో పెద్దకూరపాడు ప్రగతికి పెద్ద ఎత్తున బాటలు పరిచామని సొంత నిధులతో తాగునీటి చెరువు అభివృద్ధి, 90 శాతం సిమెంటు రహదారులు, పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్, ఎన్టీఆర్ సుజల ప్రవంతి, డొంక రోడ్లు, నేల బావిల అభివృద్ధి, విలేజ్ పార్క్, వాకింగ్ ట్రాక్, ప్రతి ఇంటికి నీటి కులాయి ఇచ్చి గ్రామాభివృద్ధికి కృషి చేసినట్లు రమేష్ ఎమ్మెల్యే కి వివరించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించే లక్ష్యంతో అప్పటి ఎమ్మెల్యే శ్రీధర్ పెదకూరపాడు గ్రామం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన తీసుకొచ్చారని కొంతమేర పనులు చేయగా వైకాపా ప్రభుత్వం రింగ్ రోడ్డు ప్రతిపాదనను అటకెక్కించిందన్నారు. పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ నుండి వాసవి కన్యకా అమ్మవారి గుడి వరకు రెండు కోట్లతో సిసి రహదారి ఏర్పాటు అలాగే ప్రియా హోటల్ సెంటర్ నుండి లగడపాడు రోడ్డు వరకు రహదారి విస్తరణ, భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు శ్రీధర్ హయాంలో ప్రణాళికలు సిద్ధం చేయగా వైకాపా సర్కారు అధికారం లోకి వచ్చి వాటిని అర్ధతరంగా నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం పెద్దకూరపాడు ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో నేతలు బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, భాష్యం ఆంజనేయులు, మక్కెనసాగర్ ఏటుకూరి బ్రహ్మయ్య, మద్దినేని సత్యం, అంద్ర ప్రసాదు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెన్నుపాటి బుల్లిబాబు, మహిళా నేతల ముంతాజ్ కల్పన సుజాత తదితరులు ఉన్నారు.

# నార్నె గోపినాథ్‌కు జాతీయస్థాయి అవార్డు

## కేంద్ర మంత్రిచే ఢిల్లీలో ప్రధానం




చిలకలూరిపేట, మేజర్ న్యూస్ : కామన్ సర్వీసెస్ సెంటర్ ద్వారా వినియోగదారులకు ఉత్తమ రీతిలో సేవలను అందించినందుకు గాను ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఇద్దరికి అత్యున్నత సేవా అవార్డులు లభించాయి. కేంద్ర వాణిజ్య పరిశ్రమలు ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ మంగళవారం కొత్త ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును వారికి అందజేశారు. అవార్డును అందుకున్న వారిలో విజాంపట్నంకు చెందిన ఆలపాటి సంధ్య, చిలకలూరిపేటకు చెందిన నార్నె గోపీనాథ్ ఉన్నారు. కామన్ సర్వీసెస్ సెంటర్ ద్వారా అత్యధిక సంఖ్యలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాల లావాదేవీలను జరిపినందుకుగాను వారికి ఈ అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రజలకు సేవలను అందించిన పదిమందిని గుర్తించింది. వారిలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఇద్దరు ఉన్నారు. ఆలపాటి సంధ్య 1,02,952 లావాదేవీలు, నార్నె గోపీనాథ్ 84,526 లావాదేవీలు గత ఆర్థిక సంవత్సరంలో జరిపి జాతీయస్థాయిలో రెండు మూడు స్థానాలలో నిలిచారు. వారిని ప్రభుత్వం అన్ని ఖర్చులు భరించి ఢిల్లీకి ప్రత్యేక ఆహ్వానంపై పిలిచి సత్కారం చేశారు.

# మరో జూనియర్ కళాశాల ఏర్పాటుకు వినుకొండ శాసనసభ్యులు జీవి హామీ



వినుకొండ, మేజర్ న్యూస్ : మండలంలోని నడిగడ్డ గ్రామమునందుగల డాక్టర్ బోడెపూడి హనుమయ్య సుప్రభాత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా ఉన్నతీకరించుటకు స్థానిక శాసనసభ్యులు జీవి ఆంజనేయులు హామీ ఇవ్వడం హర్షనీయ మని గ్రామస్తులు మంగళవారం ప్రకటన ద్వారా తెలియజేసారు. మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున్ రావు పదవి కాలంలో భావన నిర్మాణ పనులు తదితర అభివృద్ధికి కృషి చేశారన్నారు. నడిగడ్డ చుట్టుప్రక్కల నున్న పరిసర గ్రామాల ప్రజలు తమ బిడ్డల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎదురుచూస్తున్న సమయంలో కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆంజనేయులు హామీ ఇవ్వడం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలము, నిధులు స్థానికులు డాక్టర్ బోడెపూడి హనుమయ్య సుప్రభాత్ దంపతులు అందజేశారన్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఇచ్చి నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వినుకొండలో జరిగిన వి సి హెచ్ రామాచారి మాస్టర్ పదవి విరమణ అభినందన సభలో ఎమ్మెల్యే స్వయంగా సభాముఖంగా ప్రకటించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సభలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాజీ ఎమ్మెల్యే మక్కిన మల్లికార్జునరావు తదితర ప్రముఖులు కొలువై విసిహెచ్ రామాచారి మాస్టర్ తన ఉపాధ్యాయ వృత్తి నిర్వహణలో నిర్వహించిన తీరుతులను ప్రశంసిస్తూనే హైస్కూల్ ఏర్పాటు అభివృద్ధికిఆయన చేసిన కృషిని, విద్యార్థులను తీర్చి దిద్దిన నిస్వార్థ సేవ, సాధించిన విజయాలను అభినందిస్తూ నడిగడ్డలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు జరిగే కృషిలో వి సి హెచ్ రామాచారి మాస్టర్ పాలుపంచుకోవాలని గ్రామస్తులు కోరుకున్నారు.

# పట్టపగలే మద్యం సేవించి యువకుల వీరంగం



దాచేపల్లి, మేజర్ న్యూస్ : పట్టపగలే నలుగురు యువకులు మద్యం సేవించి కారును నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం వలన కారు అదుపుతప్పి గోడను బద్దలు కొట్టుకుంటూ ఇంట్లోకి దూసుకుపోయినా ఘటన దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో సుగుణమ్మ అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై ఆటోలో పిడుగురాళ్ల పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు. సమాచారం తెలుసుకున్న దాచేపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నలుగురు యువకులతో పాటు కారును అదుపులోకి తీసుకొని ప్రమాదానికి గల కారణాలపై విచారిస్తున్నారు.

# జీపీఎస్ ఆర్డినెన్సు నిలిపివేయడంపై ఎస్టీయూ హర్షం



చిలకలూరిపేట, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం జీ పీ యస్ ఆర్డినెన్సు నిలిపివేయడం పట్ల ఎస్టీ యూ హర్షం వ్యక్తం చేస్తుందని , కేంద్ర ప్రభుత్వం న్యూ పెన్షన్ పాలసీ అమలుకు చర్యలు చేపడుతున్న%శీ%దున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆదిశగా చర్యలు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు కోరారు. మంగళవారం పట్టణంలో ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయం లో జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ .రాష్ట్ర ప్రభుత్వం వీలయినంత త్వరగా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. పీఆర్సీ కమిటీ చైర్మన్ రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త చైర్మెన్ ను నియమించాలని కోరారు. పెండింగ్లో ఉన్న గత పీఆర్సీ బకాయిలు ,డి ఏ బకాయిలు చెల్లింపునకు తగు చర్యలు చేపట్టాలని కోరారు.జీ వో 117 రద్దు, యాప్ ల భారం తగ్గించి ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న వారికి 16వ తేదీ దాటినా ఇప్పటికి జీతాలు జమ చేయలేదని అన్నారు. సిబ్బంది అందరూ ఇరవై వేల మంది కి పైగా వుంటారని వారి కుటుంబాలు ఈ జీతాల పై ఆధారపడి ఉంటాయి కావున రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి గారు చొరవ చూపించి వారికీ జీతాలు అందించాలి అని కోరారు.. ఈ సమావేశం లోపల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ. అక్కయ్య, జిల్లా కౌన్సిలర్ షేక్ జమీర్ బాషా. సీనియర్ నాయకులు చావలి మల్లేశ్వరరావు. చిలకలూరిపేట పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వర రావు ప్రధాన కార్యదర్శి వడ్లాన. జయప్రకాష్. పట్టణ నాయకులు ఇనకోల్లు అంకమ్మారావు.పి సాగర్ బాబు. కె ఏడుకొండలు. యం చిన వేంకట స్వామి. సొమ్ము నాయక్. అట్లూరి శ్రీనివాసరావు. ఫరిసా తదితరులు పాల్గొన్నారు.

## మాచవరం ఇన్‌చార్జి ఎంఈఓ1గా శ్రీనివాస రెడ్డి

మాచవరం, మేజర్ న్యూస్: మాచవరం మండలం ఇన్చార్జి మండల విద్యా వనరుల విద్యాధికారి 1 గా ఏ. శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఎంఈఓ ఆఫీస్ నందు బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్ రెడ్డి మాచ వరం మండలం పిల్లుట్ల జీవీజీ కెఆర్ఓ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తు న్నారు. ఎంఈఓ1 ఎఫ్ఎసిగా బాధ్యతలు స్వీకరి ంచి మండల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

## నేడు మొహరం వేడుకలు

మాచవరం, మేజర్ న్యూస్ : మాచవరం మండలంలోని పిన్నెల్లి, రేగులగడ్డ, మాచవరం, గంగిరెడ్డిపాలెం, పిల్లోట్ల, వేమవరం, మొర్జంపాడు, పలు గ్రామాలలో పదవ సరగస్తు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ముస్లిం సోదరులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఆయా గ్రామాల్లో కులాలకు మతాలకతీతంగా ఈ మొహరం పండుగ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించుకుంటున్నారు.

## త్రాగునీటి పైప్ లైన్లనుపరిశీలించిన కమిషనర్ గోవిందరావు.

చిలకలూరిపేట, మేజర్ న్యూస్: పట్టణంలో 21 26 వార్డుల నందు నీటి సరఫరా జరిగే సమయంలో మున్సిపల్ కమిషనర్ సందర్శించారు. నీటి పైపు మరమ్మత్తు అయిన క్లోరిన్ టెస్ట్, వాల్వ్ పిట్స్ నువ్వు పరిశీలించారు. అనంతరం గడియార స్తంభం దగ్గర ఉన్న డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ మరమత్తులను కూడా పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి నీటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ డి ఈ రమణ, ఏఈ చెల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## మొర్జంపాడులో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు

మాచవరం, మేజర్ న్యూస్ : మాచవరం మండలం మొర్జంపాడు సమీపంలో గల శ్రీ భ్రమరాంబ సమేత బుగ్గ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు స్వామివారి శివలింగానికి అభిషేక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్తలు మందాది హరినాథ్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి దర్శించుకుంటారని ఇప్పటికే ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తుల కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హరినాథ్ తెలిపారు .ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు కూడా అందజేస్తామన్నారు.



## గుంటూరు మహిళా వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య. బ్యూరో:** గుంటూరు మహిళా జూనియర్ కళాశాలను మంగళవారం తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నూతన భవనాలను, బోధన జరుగుతున్న తరగతి గదులను ఎమ్మెల్యే సందర్శించారు. కాసేపు ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి కళాశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు అందాలని కళాశాల అభివృద్ధి కి తను సహకారం అందిస్తానని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థ ను గాలికి వదిలేసిందని, నాడు నేడు పేరుతో కోట్ల రూపాయిలు దోచుకుందే కానీ కళాశాల అభివృద్ధి చేయలేదన్నారు. కళాశాలలో చాలా సమస్యలు ఉన్నాయని వాటిని విద్యా శాఖ మంత్రి గారి దృష్టికి తీసుకొనివెళ్లి సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మహిళా వసతి గృహం, భోజనశాల ను పరిశీలించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే నసీర్ గారితో పాటు కార్పొరేటర్లు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, కళాశాల కమిటీ సభ్యులు తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 21న వాఙ్మయ చరిత్ర పుస్తకావిష్కరణ

**గుంటూరు(సాంస్కృతికం) మేజర్ న్యూస్:** స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక కళావేదికపై అజో విభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంగీత సాహిత్య నృత్య నాటక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న సాహితీవేత్త ఏల్చూరి మురళీధరరావు రచించిన వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు, మరికొన్ని విశేషాంశాలు సాహిత్య గ్రంథావిష్కరణ సభ జరుగునని సంస్కృతి సత్రాజు బాలచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సభకు అధ్యక్షత వహించే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ గ్రంధాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఏ గ్రంధాని కి కృతికర్తగా ఆచార్య అప్పా జోశ్యుల సత్యనారాయణ స్వీకరిస్తారు. సభలో సాహితీవేత్తలు అద్దంకి శ్రీనివాస్, రావి మోహన్ రావు, పరిమి శ్రీరామనాథ్, ఏల్చూరి మురళీధర్ రావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## కార్డ్స్ ఆధ్వర్యంలో విపత్తు, ప్రమాద నివారణ చర్యలు శిక్షణా తరగతులు



**గుంటూరు మేజర్ న్యూస్:** కమ్యూనిటీ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కార్డ్స్ ఆధ్వర్యంలో గుంటూరు సంతోష్ నగర్ అరనాల్డ్ పౌలస్ ఆడిటోరియం నందు "డిజాస్టర్ రిస్క్ రిడక్షన్" విపత్తు ప్రమాద నివారణ చర్యలు గూర్చి రెండు రోజులపాటుశిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమాన్ని కార్డ్స్ చైర్మన్ డా. ఫ్రాంక్ విశ్వనాథ్ ప్రారంభించారు తుఫాన్ వరద సునామి అగ్నిప్రమాదం భూకంపం వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి ఎలాంటి ప్రణాళికలతో ముందుకు వెళ్లాలి అనే అంశంపై రెండు రోజుల శిక్షణ తరగతులలో కేరళ కు చెందిన హర్షన్ కాలేశ్వర రావులు శిక్షణ ఇచ్చారు. విపత్తు సంభవించినప్పుడు ఏ ప్రాంతాల ప్రజలు ఎంత మేరకు నష్టపోయారు విపత్తు తీవ్రత ఎంత ప్రభావం చూపించింది, ఆపదలో ఉన్న వారికి కావలసిన సహాయక చర్యలు పునరావాస కేంద్రాలకు తరలించటం ఆహార సదుపాయాలు మందులు అందించడం వంటి సహాయక కార్యక్రమాలలో డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ శిక్షణ బృందం సమర్థవంతమైన పాత్ర పోషించాలని హర్షన్ వివరించారు. శిక్షణా నంతరం శిక్షణ లో పాల్గొన్న వారికి డా యం స్వర్ణలతాదేవి, హర్షన్ లు సర్టిఫికెట్స్ అందజేసారు.


**సూర్య** విలేకరులు కావలెను..

**ఉత్సాహవంతులైన యువతకు "నేటిదినపత్రిక సూర్య" ఆహ్వానం పలుకుతుంది. సమాజంలో పాతుకుపోయిన అవినీతిపై సాగుతున్న అక్షర సమరంలో భాగస్వాములు కండి. స్థానిక అంశాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.**

కావాల్సిన సెంటర్లు..

**మాచెర్ల నియోజక వర్గం:** మాచర్ల RC ఇంఛార్జి,వెల్దుర్తి,దుర్గి, విజయపురిసౌత్.
**గురజాల నియోజకవర్గం:** పిడుగురాళ్ల RC, గురజాల, దాచేపల్లి, మాచవరం
**వినుకొండ నియోజక వర్గం:** వినుకొండ టౌన్, ఈపూరు, బొల్లాపల్లి.
**సత్తెనపల్లి నియోజకవర్గం:** సత్తెనపల్లిటౌన్, రాజుపాలెం, నేకరికల్లు, ముప్పాళ్ళ.
**పెదకూరపాడు నియోజక వర్గం:** పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ, అచ్చంపేట.
**నరసరావుపేట నియోజకవర్గం:** నరసరావుపేట RC, నరసరావుపేట టౌన్, నరసరావుపేట రూరల్,రొంపిచర్ల.

**ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.. 9394423456**


## రెవెన్యూ మంత్రి అనగానికి పలువురు శుభాకాంక్షలు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో** అమరావతిలోని సచివాలయంలో మంగళవారం రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ ని భూ పరిపాలన ప్రధాన కమీషనర్(సిసిఎల్ఏ) జి.జయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. భూ చట్టాల అమలు తీరుపై జయలక్ష్మీతో చర్చించి మంత్రి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా మంత్రి. అనగాని సత్యప్రసాద్ ను అమరావతిలోని సచివాలయంలో మంగళవారం విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు, ఏపీ సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## ఎస్పీ తుషార్ డూడికి ఘన సత్కారం



**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్** గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి సాధారణ బదిలీ లలో భాగంగా బాపట్ల జిల్లా కు బదిలీ పై వెళుతున్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్నికల సమయంలో గుంటూరు జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులు మరియు సిబ్బంది సహకారం అమోఘం అని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఈ సందర్భంగా కొనియాడారు. స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో జిల్లా పోలీస్ అధికారులు పోలీసు కవాతు నిర్వహించి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం, పోలీసు వందనం సమర్పించారు. శాంతి భద్రతలు పరిరక్షించే విషయంలో, ఎన్నికల విధుల సమయంలో, సమస్యాత్మక విషయాలను సున్నిత దృక్పథంతో పరిష్కరించే విధానం ఎస్పీ గొప్ప లక్షణమని పలువురు పేర్కొన్నారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ... జిల్లాలోని పోలీస్ అధికారులు వారికి అప్పగించిన విధులు నిబద్ధతతో నిర్వహించడం వల్లనే జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా పరిరక్షించగలిగామని ఎస్పీ తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి పోలీస్ అధికారి సిబ్బంది సహకారంతోనే జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధంగా ఇప్పటి వరకు సహకరించిన గుంటూరు జిల్లాలోని అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారుల దగ్గర నుంచి పోలీసు అధికారులకు సిబ్బందికి మరియు మీడియా ప్రతినిధులకు ఎస్పీ తుషార్ డూడి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్ డివిజన్ ఎయస్పి నిచికేట్ షెల్కే, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జి వి రమణమూర్తి, లా అర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, యస్ ఇ బి అడిషనల్ ఎస్పీ వేంకటేశ్వర రావు, ఎఆర్ డి ఎస్ పి శాంత కుమార్, వెస్ట్ డి ఎస్ పి మహేష్, సౌత్ డి ఎస్ పి మహబూబ్ బాషా, స్పెషల్ బ్రాంచ్ డి ఎస్ పి రత్న స్వామి, యస్ టి యస్ సి డి ఎస్ పి మల్లిఖార్జున రావు, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## సిపిఎస్, జిపిఎస్ వద్దు.. మాకు ఓపిఎస్ కావాలి

### ఏపిజిఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా డిమాండ్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయం లో జిల్లా అధ్యక్షులు చాంద్ బాష మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జిపిఎస్ యాక్ట్ ను తాత్కాలికంగా నిలిపివేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. జిపిఎస్ యాక్ట్ ను వెనక్కి తీసుకోవటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చాలా మేలు జరుగుతుందని చెప్పారు. అలాగే ఉద్యోగులు , ఉపాధ్యాయులు అందరూ పాత పెన్షన్ విధానం కావాలని కోరుకుంటున్నారని , చెప్పారు. సిపిఎస్ కు లేదా జిపిఎస్ కు ప్రభుత్వ ఉద్యోగులు అంగీ రించే పరిస్థితుల్లో లేరని , గత దశాబ్దకాలం నుండి ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ శాపంగా మారిందని చెప్పారు, గత ప్రభుత్వం సిపిఎస్ ను రద్దు చేస్తాం అని చెప్పి ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసిందని తెలిపారు. ఏ ప్రభుత్వం అయినా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేసి తీరాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చాంద్ బాష ,జిల్లా కార్యదర్శి శివారెడ్డి ,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా షాఖాదరి, జిల్లా కోశాధికారి పోతురాజు, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు , పెద రత్తయ్య, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సుమిత్రా దేవి, , సహా అధ్యక్షురాలు హేమలత రోజా, , శేష కుమారి తదితరులు పాల్గొన్నారు



## ప్రయాణికుల సౌకర్యమే ధ్యేయంగా ఆర్టీసీ పనిచేయాలి: తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** ప్రయివేట్ ట్రావెల్స్ దీటుగా ఏపీఎస్ఆర్టీసీ నూతన బస్సులు ప్రవేశ పెట్టిందని ప్రయాణికుల సౌకర్యమే ప్రధాన లక్ష్యం గా ఆర్టీసీ అధికారులు పనిచేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. అదే కూటమి ప్రభుత్వం విధానం అని ఆయన చెప్పారు. మంగళవారం గుంటూరు ఆర్టీసీ ప్రాంగణంలో నూతనంగా ఇంద్ర బస్సు , సూపర్ డీలక్స్ బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ఆర్టిసి ద్వారా 288 మరియు హాయర్ బస్సులు 67 పనిచేస్తున్నాయి. ప్రతీ రోజు 111 రూట్లలో 122525 మంది ప్రయాణికులను 143410 కిలోమీటర్లు వారి వారినీ గమ్యస్థానాలకు చేరుస్తున్నారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్, డీలక్స్, సూపర్ డీలక్స్, ఇంద్ర బస్సుల ద్వారా 689 మంది డ్రైవర్లు 724 మంది కండక్టర్లు ప్రయాణికులకు సౌకర్యార్థం పనిచేస్తున్నారని తెలిపారు. ప్రయాణికులు మరింత సౌకర్యం అందించేందుకు నూతనంగా ఇంద్ర, సూపర్ డీలక్స్ బస్సులు ఈరోజు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని ప్రజలందరూ ఈ సౌకర్యలను వినియోగించు కోవాలని దీంతో సంస్థను మరింత అభివృద్ధి పదేందుకు దోహదపడాలని కోరారు. ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ గారితో పాటు ఆర్టిసి సిబ్బంది, వార్డ్ మెంబర్లు, తూర్పు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన కార్మెల్ మాత ఉత్సవాలు

**ఫిరంగిపురం మేజర్ న్యూస్:** ఫిరంగిపురంలో కార్మెల్ కొండపై నిర్వహిస్తున్న కార్మెల్ మాత ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. బాల ఏసుదేవాలయం విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి, ఇతర గురువులు దివ్య పూజా బలి నిర్వహించారు. పూజ అనంతరం కార్మెల్ మాత దేవాలయం చుట్టూ కార్మెల్ మాత స్వరూప తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్మెల్ మాతను దర్శించుకున్నారు



# డ్రైన్‌లలో మురుగు ప్రవాహానికి ఆటంకం లేకుండా చూసుకోండి







## ఎప్పటికప్పుడు వ్యర్థ సేకరణ చేస్తూ పారిశుధ్య నిర్వాహణ పక్కాగా జరిపించండి

### నగర ఇంచార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ అధికారులకు ఆదేశాలు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ ఏ మహేష్ తన పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం దేవినగర్, వన్ టౌన్,పాతబస్తీ, పంజా సెంటర్, ఆయుష్ హాస్పిటల్ రోడ్ క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు పరిశీలించారు. ముందుగా దేవినగర్లో విజయవాడ వైజాగ్ లైన్ దగ్గర గల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ సిబ్బందితో పరిశీలించారు. తదుపరి వన్‌టౌన్ జెండా చెట్టులో గల బిటీ రోడ్డు, పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. నిరంతరం డీసెల్టింగ్ పనులు చేస్తూ మురుగు ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

తదుపరి ఆయుష్ హాస్పిటల్ రోడ్, హై టెన్షన్ వైర్ రోడ్డు, రామవరపాడు నేషనల్ హైవే సర్వీస్ రోడ్‌లో ఉన్న వర్షపు నీటిని నిలువలను పరిశీలించారు ఇంజనీరింగ్ సిబ్బంది వర్షపు నీటి నిల్వలను లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రజలకి ఎటు వంటి అసౌకర్యం కలగకుండా వ్యర్థాల సేకరణ ఎప్పటికప్పుడు చేస్తూ వ్యర్థాల ను రోడ్డు మీద పారి వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే సీజనల్ వ్యాధుల నుండి దూరంగా ఉండగలమని, అందుకు విజయవాడ నగరపాలక సంస్థ తగిన చర్యలు తీసుకుంటుందని, ప్రజలు కూడా నగరపాలక సంస్థకు సహకరిస్తూ చెత్తను వీధుల్లో పారవేయ కుండా తమ వంతు కృషిని అందించాలని కోరారు.

# ప్లాస్టిక్ రహిత సమాజానికి ఎల్లప్పుడు సహకరిస్తాం



## కాలుష్య రహిత సమాజానికి తోడ్పడుదాం

### ఇంచార్జి కమిషనర్ డాక్టర్ ఏ మహేష్

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ ఏ మహేష్‌ను సఫాయి కర్మచారి అసోసియేషన్ అండ్ ట్రీస్ గ్రూప్ వారు మంగళవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో గల ఇంచార్జ్ కమిషనర్ చాంబర్లో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం వారు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని, అందుకు అనుమతి ఇవ్వమని కోరారు. అసోసియేషన్ తరపున వారు 2200 యువతి యువకులతో కలిసి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆర్గానిక్ పద్ధతిలో 15 లక్షల ఫలాల మొక్కలను నాటే విధంగా ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ ఎ మహేష్ ప్లాస్టిక్ రహిత సమాజానికి ఎల్లప్పుడూ విజయవాడ నగరపాలక సంస్థ సహకరిస్తుందని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం వారు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. యువతీ యువకులు ఇందులో భాగస్వాములు అవుతూ మొక్కలను నాటడం వల్ల కాలుష్యం రహితమైన సమాజానికి తోడ్పడడంలో ఒక అవకాశం అని అన్నారు. ఈ సమావేశంలో సఫాయి కర్మచారి అసోసియేషన్ అండ్ ట్రీస్ గ్రూప్ స్టేట్ ప్రెసిడెంట్ బండి కాలేశ్వర్ రావు, కోఆర్డినేటర్ మురళి, సెక్రటరీ దుర్గారావు, సభ్యులు ఫిలిప్స్ కారంగి, కొమర వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్ఆర్ ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో సిఎస్ఆర్, ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో సి.ఎస్.ఆర్., ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై సంబంధిత శాఖ అధికారులు, ఏజెన్సీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బహుళ ప్రయోజనకర కమ్యూనిటీ హాళ్లు, డిజిటల్ లైబ్రరీ భవనాల నిర్మాణం, మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు తదితర మౌలిక వసతుల కల్పన కోసం సి ఎస్ ఆర్, ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలు విధిగా పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఒక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా చెక్ లిస్ట్ ప్రకారం పనుల్లో పురోగతి సాధించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే తన పరిధిలో నిధులు విడుదల చేసి చెల్లింపులు జరుపుతామన్నారు. ఎటువంటి ఆలస్యమూ చేయకుండా కావలసిన తలుపులు, వైర్లు, స్టీలు తదితర సామాగ్రి, పరికరాలను వెంటనే సమాంతరంగా సమకూర్చుకుంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ అంశంపై సమీక్షిస్తామని, మొత్తం ఎన్ని పనులు మంజూరయ్యాయి, ఏ ఏ దశలో ఉన్నాయి ఇంకా ఎన్ని పెండింగ్లో ఉన్నాయి తదితర వివరాలతో కూడిన సమగ్ర సమాచార నివేదికను వచ్చే సమావేశానికి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధించి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ గణేష్ పంచాయితీ రాజు ఆర్డబ్ల్యూఎస్ ఈఈ లు ఏవిఎస్ శ్రీనివాస్, శివప్రసాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్, రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ కార్యదర్శి వసంతరావు మేనేజర్ వి కోటారెడ్డి ఏఎం కెవి రమణ డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్ ఏపీ ఈ డబ్ల్యూ ఐడిసి సొసైటీ ఇంజనీరు రాయన్న తదితర అధికారులు పాల్గొన్నారు.



# క్షేమ విస్తృత శ్రేణి సాంకేతికతతో పంట బీమాకు విప్లవాత్మక సామర్థ్యం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తమ యాజమాన్య క్షేమ ప్లాట్ఫారమ్‌కు నవీకరించబడిన వెర్షన్ ను అందిస్తోంది. తద్వారా ఈ ఖరీఫ్ సీజన్ కోసం తమ పంట బీమా ఉత్పత్తి అయిన 'సుకృతి'ని కొనుగోలు చేసే ప్రక్రియను మరింత సులభతరం చేస్తుంది. ఈ ఆధునీకరణలు మరింత సామర్థ్యాన్ని తీసుకురావటంతో పాటుగా తమ ఖరీఫ్ పంటను ప్రమాదాల నుండి రక్షించుకోవాలని చూస్తున్న భారతదేశంలోని కోట్లాది మంది రైతులకు సేవా డెలివరీని మెరుగుపరుస్తాయి. ఈ ఖరీఫ్ లో పంట బీమా ప్రీమియం ఎకరానికి రెండు ప్రమాదాల వరకు సరసమైన ప్రారంభ ధర రూ.499గా ఉంటుంది. డైనమిక్ ధర, పూచీకత్తు, నిరంతర వ్యవసాయ పర్యవేక్షణ, వేగవంతమైన క్లెయిమ్‌ల పరిష్కారం కోసం యాజమాన్య కృత్రిమ మేధస్సు అల్గారిథమ్ల ద్వారా ఆధారితమైన వినియోగదారు స్నేహపూర్వక, సహజమైన క్షేమ యాప్‌ను ఈ క్షేమ ప్లాట్ఫారమ్ కలిగి ఉంది.

## బి2బి సమావేశాలను నిర్వహించనున్న అసోచామ్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** షార్జా, యూఏఈ ప్రభుత్వం సహకారంతో, యూఏఈ ద్వారా ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాన్ని విస్తరించడం అనే అంశంపై ప్రత్యేకమైన బి2బి సమావేశాలను నిర్వహించనున్నట్టు అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) ప్రకటించింది. ఈ సమావేశాలు ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని నోవాటెల్ వరుణ్‌లో జరుగుతాయి. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మద్దతుతో నిర్వహించబడనున్న ఈ కార్యక్రమం యూఏఈ, విస్తృత మధ్య ప్రాచ్యంలో ఉన్న అవకాశాలతో భారతీయ వ్యాపారాలను అనుసంధానించడం లక్ష్యంగా పెట్టుకుందని అసోచామ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణా డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్, యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ సీఎండీ రవి కుమార్ రెడ్డి కటారు తెలిపారు. ఈ సమావేశాలలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ ఫీజు లేదని, కానీ ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని అన్నారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టండి

### బండి రామకృష్ణ జన సైనికులకు పిలుపు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం క్రియాశీలక సభ్యత్వంతో కూడిన జీవిత బీమాను భారతదేశంలో ఏర్పాటుచేసిన ఏకైక నాయకుడని బండి రామకృష్ణ పేర్కొన్నారు. మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో జనసైనికులతో మాట్లాడుతూ ఈనెల 18 నుండి 28 వరకు జరగనున్న క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేయాలని జన సైనికులకు పిలుపునిచ్చారు. (500 రూపాయలు) క్రియాశీలక సభ్యత్వం రుసుముగా చెల్లించి 5 లక్షలు జీవిత బీమా 50,000 వేలు ప్రమాద బీమా పొందే విధంగా రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేశారని తెలిపారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సభ్యత్వ నమోదుకు ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నెంబర్ నామినీ పేరు నామిని ఆధార్ కార్డు తో పాటు 500 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జనసేన పార్టీ నాయకులు జనసైనికులు వీర మహిళలు క్రియాశీలక సభ్యత్వం నమోదు పై అవగాహన కల్పించి జనసేన పార్టీలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నగరఅధ్యక్షులు గడ్డంరాజు, సర్పంచ్ బొమ్మసానినరేష్, డివిజన్ ఇన్చార్జిలు జనసేన పార్టీ నాయకులు పినిశెట్టి వేణు, కొండ మేస్త్రి, శాయనశివ, గుణ్ణంవాసు, వడ్డీ చిరంజీవి, ఈవన మణిబాబు, ఊచచంటి, మంత్రి పృధ్వి, విన్నకోట శ్రీకాంత్, సురేష్, సాయి, బొద్దుల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేడియం నుంచి వరద నీరు తరలింపు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** ఇటీవల కురిసిన వర్షాలకు చెరువును తలపించేలా ఉన్న స్టేడియంలోని నీటిని బయటకు పంపే విధంగా 45 డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి.వి.ఫణి కుమార్, డివిజన్ శానిటేషన్ మేస్త్రి, బి.వి.రామశేఖర్ చర్యలు తీసుకుంటున్నారు.



## గొట్టుముక్కలలో రోడ్లు అభివృద్ధి పనులు ప్రారంభం

**కంచికచర్ల జులై 16 మేజర్ న్యూస్ :** మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు ప్రారంభించారు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం గుంతలను టిప్పర్ల తో డస్ట్ తొలి డోజర్ ద్వారా సరిచేసి రోలర్‌తో గుంతలను చదును చేశారు. వర్షాకాలం కావడంతో కొన్ని రోజుల నుంచి గుంతలలో నీరు నిలచీ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు ప్రయాణించే సమయంలో రోడ్డు పక్కనే నడుస్తున్న పాదచారులపై బురద నీరు పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది, ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని సర్పంచ్ తుల్లి మల్లి రాజ్ కుమార్, ఉప సర్పంచ్ గోగినేని అమర్నాథ్ తక్షణమే స్పందించి గ్రామంలో ఉన్న రోడ్ల కు అభివృద్ధి పనులను ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వనిత, వార్డ్ మెంబర్లు,, గోగినేని శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు,

## వాయిస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ సీయోను ప్రార్థనా మందిరం

### 15వ వార్షికోత్సవ ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, జూలై 16, మేజర్ న్యూస్:** పట్టమంలో డీవీఆర్ కాలనీలో వాయిస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ సీయోను ప్రార్థనా మందిరం వారు నిర్వహించిన 15వ వార్షికోత్సవ ఆరాధన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నంది గామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 15 ఏళ్లుగా విజయవంతంగా వాయిస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ సీయోను మందిరాన్ని నడుపుతున్న వారికి అభినందనలు తెలియజేసారు. మరి ముఖ్యంగా ఛైర్మన్ వాయిస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్, జీడీఎంఎం ఇంజనీరింగ్ కళాశాల అధినేత ప్రసాదరావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వర్తమానికులు పాస్టర్ రాజు పాస్టర్ గురువిందపల్లి సురేష్ శాంతి శ్రీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## 19న అరుణాచలంకు ప్రత్యేక సర్వీసు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** గురుపౌర్ణమికి అరుణాచల గిరి ప్రదక్షణ నిమిత్తం ప్రత్యేక ఆర్.టి.సి సర్వీసును నడుపుతున్నట్లు ఆర్.టి.సి డి.ఎం కె హనుమంతురావు చెప్పారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ, చల్లపల్లి, రేపల్లె పరిసర ప్రాంత ప్రయాణికులు ప్రతి నెల పౌర్ణమికి అరుణాచల గిరి ప్రదక్షణ నిమిత్తం ప్రత్యేక సర్వీసును నడుపుతున్నట్లు చెప్పారు. ఈ నెలలో గురుపౌర్ణమికి 19 వ తేది శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఆర్.టి.సి సర్వీసు అవనిగడ్డలో బయలుదేరి రేపల్లె, బాపట్ల, చీరాల మీదుగా కాణీపాకం, అర్ధవీడు, సిరిపురం, అరుణాచలం వెళ్ళి 20 వ తేది గురుపౌర్ణమి దైవదర్శనం, గిరి ప్రదక్షణ చేసుకుని తిరుగు ప్రయాణంలో కంచి, విష్ణుకంచి, కామాక్షమ్మ గుడి, బంగారు బల్లి, తిరుతుని, శ్రీకాళహస్తి దర్శనాలు ముగించుకుని 22 వ తేది సోమవారం ఉదయం అవనిగడ్డ బస్ స్టాండ్ చేరుకుంటుందని, ఈ సర్వీసుకు రిజర్వేషన్ సౌకర్యం కలదని, టిక్కెట్ల కొరకు ఆన్‌లైన్‌లో కానీ, రిజర్వేషన్ కౌంటర్ వద్ద కానీ పొందవచ్చుని, ఒకొక్కరికి చార్జీ రానూపోనూ 3 వేల రూపాయలని మరిన్ని వివరాలకు 7036335079 గానీ 9959225466 గానీ సంప్రదించాలన్నారు.

# దోమల నివారణ, శానిటేషన్లో ప్రజల భాగస్వామ్యం అవసరం



**ఓవర్హెడ్ రిజర్వాయర్లలో క్లీనింగ్, క్లోరినేషన్ పూర్తి చేయండి..**

**విద్యార్థి దశ నుండే శానిటేషన్, దోమల నివారణపై అవగాహన కల్పించాలి..**

**ప్రైవేట్ శానిటైజేషన్ ఏజెన్సీలకు కూడా అవగాహన కల్పించాలి..**

**అన్ని అర్వో ప్లాంట్ల మ్యాపింగ్ జరపాలి..**

**జిల్లా కలెక్టర్ డా. జి. సృజన**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్యం, దోమల నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం శానిటేషన్, సీజనల్ వ్యాధులపై పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, నగరపాలక సంస్థ, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ జి సృజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వారం (ఫ్రైడేను డ్రైడేగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వ్యాధులు ప్రబలటానికి ముందే వాటిని అరికట్టే విధంగా అవగాహన కల్పించి భాగస్వాములను చేయాలన్నారు. దోమల ద్వారా ప్రబలే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా వంటి వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ముందుగా వారికి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని 288 గ్రామపంచాయతీలో 389 హ్యాబిటేషన్లలో ప్రతిరోజు నిర్వహించే శానిటేషన్‌తో పాటు ఈ వర్షాకాల సీజన్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లాలోని 588 ఓహెచ్ఐర్ ఓవర్హెడ్ రిజర్వాయర్లలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం క్లీనింగ్, క్లోరినేషన్ జరగాలని ప్రతి ఓహెచ్ఎర్ ప్లాంట్ క్లీనింగ్ అనంతరం జియో టాగింగ్, ఫోటో ను నిర్దేశించిన ఫార్మాట్లో పొందుపరచాలన్నారు. క్లీనింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఇఓపి ఆర్డి సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. ఎక్కడైనా ఓహెచ్ఎర్ శుభ్రం చేయలేదని ఆరోపణ వస్తే సంబంధిత ఇఓపిఆర్డి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులను వ్యాప్తి చేసే దోమలు సాధారణంగా మనం వినియోగించే మంచినీటి నిల్వలనుండి లార్వా ద్వారా ఉత్పత్తి అవుతాయనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. (ఫ్రైడే డ్రై కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో పాటు ప్రజలను భాగస్వాములు చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ వార్డు సచివాలయాలు, ఎంపీడీవోలు, ఈఓఆర్డీలు, పంచాయతీరాజ్ సెక్రటరీలు మున్సిపల్ కమిషనర్లు (ఫ్రైడే డ్రై డే లో పాల్గొనాలన్నారు. ప్రతి సచివాలయంలోనూ సిబ్బందితో శానిటేషన్ పై ఏ విధంగా చేయాలన్న దానిపై అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై సచివాలయంతో పాటు నగరపాల సంస్థ పరిధిలోను, గ్రామాలలోని పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కల్పించాలన్నారు మనకు తెలియకుండానే డెంగ్యూ మలేరియా వ్యాధులు దోమల ద్వారా మన ఇంటి నుండీ వ్యాప్తి జరుగుతుందనే విషయంపై ప్రజలకు అవగాహన ఉండాలి అన్నారు. నగర పాలక సంస్థ, మున్సిపల్, గ్రామ పంచాయితీల వరిధిలోని ఆర్వో ప్లాంట్ల మ్యాపింగ్ చేయాలన్నారు. దోమల నియంత్రణ, శానిటేషన్పై అవగాహన పోస్టర్లు, పాంప్లెట్లు వీడియో షార్ట్ క్లిప్పింగ్స్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థి దశ నుండే శానిటేషన్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించే విధంగా ప్రతి శనివారం అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లో నిర్వహించే అసెంబ్లీలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా శానిటేషన్ నిర్వహించే పర్యాటక, దేవాదాయ ప్రభుత్వ ఆసుపత్రి శానిటేషన్ సిబ్బందికి కూడా శానిటేషన్, దోమల వ్యాప్తి పై అవగాహన కల్పించాలని కలెక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. అనంతరం సీజనల్ వ్యాధులు, దోమల వ్యాప్తి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించే అవగాహన పోస్టర్లు, పాంప్లెట్లను కలెక్టర్ జి సృజన విడుదల చేశారు. సమావేశంలో డియంహెచ్వో డా. యం సుహాసిని, నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డా. ఏ.మహేష్, చీఫ్ ఇంజనీర్ యం ప్రభాకర్రావు, డిపివో శివప్రసాద్ యాదవ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంటెంట్ డా. వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి డా. మోతిబాబు, నగర పాలక సంస్థ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, డిసిహెచ్ఎస్ డా. బిసికె నాయక్ డా. ఎన్టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డా. జె. సుమన్ ఉన్నారు.

# తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు కృషి





**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** నియోజకవర్గంలో సమగ్ర సమర్ధ తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ నియోజకవర్గంలోని ఆరు మండలాల పంచాయతీ కార్యదర్శులతో గ్రామ పంచాయతీల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో తాగునీటి సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు అనువుగా సమగ్ర ప్రతిపాదనలు తనకు అందించాలని కోరారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో నిధులు మంజూరు చేయించి సమగ్ర తాగునీటి వ్యవస్థ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్టీ నివాస ప్రాంతాల్లో విద్యుత్ సమస్య పరిష్కారం చేయాలన్నారు. ఎస్టీ నివాస ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు నింపాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, రహదారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు సక్రమంగా జరగాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి తప్పు చేయకుండా పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పని చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలు గత ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయన్నారు. తీర గ్రామాలు, మారుమూల గ్రామాలతో పాటు, పెద్ద పంచాయతీల్లో కూడా తాగునీటి సమస్య పరిష్కారం చేసుకునేందుకు అనువుగా నిధులు సాధించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాల న్నారు. దఫాలవారీగా గ్రామాల్లో సమస్యలన్ని పరిష్కారం చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు సానుకూల దృక్పథంతో పని చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీ ద్వారా గ్రామాల్లో సమస్యలు పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు చట్టబద్దమైన పరిపాలన అందించాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకుల సూచనలు పాటించి కొందరు పంచాయతీ కార్యదర్శులు టీడీపీ, జనసేన అనుకూల సర్పంచులను ఇబ్బంది పెట్టారన్నారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా పంచాయతీ కార్యదర్శులు పార్టీ రహితంగా పని చేయాలన్నారు. డీపీఓ నాగేశ్వర నాయక్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల ప్రవర్తన బాధ్యతాయుతంగా ఉండాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ రూల్ ప్రకారం పని చేయాల న్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఓహెచ్ఎస్ఆర్, తాగునీటి చెరువులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్స్, జల జీవన్ మిషన్ పైప్ లైన్ పనులు, నూతన ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

## హజరత్ జల్ జలాలే సాహెబ్ పంజా వద్ద మొహర్రం సందర్భంగా భారీ అన్నదానం





**ఇబ్రహీంపట్నం, జూలై 16, మేజర్ న్యూస్ :** మొహరం పర్వదినాన్ని పుర స్కరించుకొని కొండపల్లి పట్టణ పరిధిలోని హజరత్ జల్ జలాలే సాహెబ్ పంజా వద్ద సోమవారం రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారా మయ్య. సూఫీ మత గురువు అల్తాఫ్ బాబా ప్రత్యేక ప్రార్థనలు (ఫాతెహాఖానీ) నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, ధర్మం కోసం చిన్న పెద్ద తేడా లేకుండా 72 మంది మహమ్మద్ ప్రవక్త వంశస్థులు కొన్ని రోజులపాటు ధర్మపోరాటం చేసి అశువులు బాసిన సందర్భంగా మొహరం 10 రోజులు ముస్లిం సోదరులు సంతాప దినాలుగా నిర్వహిస్తున్నట్లు చెప్పా రు. తొమ్మిదో రోజు పంజా నిర్వాహకులు అన్నదానం చేసినట్లు వివరించారు. బుధవారం భారీ ఊరేగింపుతో మొహరం ముగుస్తుందన్నారు. అన్నదానానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## మునగచర్లలో ఆషాడం సందడి.... కన్నుల పండువగా బోనాలు

### దుర్గమ్మకు సారె సమర్పణ కోసం తరలిన టీడీపీ శ్రేణులు

### బోనం పట్టి నడిచిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య






**నందిగామ, జులై 16, మేజర్ న్యూస్ :** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించి అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ జిల్లా నందిగామ రూరల్ మండలం మునగచర్ల గ్రామస్తులు తమ మొక్కులు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం నాడు గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. శ్రీ సీతారామాంజనేయ భజన, కోలాట సమాజం వారు పెద్ద ఎత్తున మహిళలు మేలతాళాలతో దేవస్థానంలో పూజలు నిర్వహిం చారు. పసుపు, కుంకుమ, గాజులు, పుష్పాలు, వస్త్రాలు, చలిమిడి, పండ్లతో పాటు ఇతర సుమంగళ ద్రవ్యాలు, పదార్ధాలను తీసుకుని మేళతాళాలు, వేద మంత్రోచ్చరణల నడుమ ఆషాఢమాసం సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించేందుకు బయలుదేరారు. కూటమి ప్రభుత్వం విజయం సాధించి తిరిగి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యంత్రి, నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తంగిరాల సౌమ్య భారీ మెజారిటీ సాధించన సందర్భంగా వారు మొక్కులు చెల్లించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామి, గ్రామ తెలుగుదేశం పార్టీ నేతలతో పాటు మండల పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సంపద సృష్టి ద్వారా సిసలైన సంక్షేమం






**నందిగామ, జూలై 16, మేజర్ న్యూస్:** సంపద సృష్టించడం ఎన్డీయే కూటమికి తెలుసునని, రానున్న కాలంలోనూ సంపద సృష్టించి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే బాధ్యత సీఎం చంద్రబాబు నాయుడు తీసుకుంటారని నందిగామ ఎమ్మెల్యే తంరిగాల సౌమ్య స్పష్టం చేసారు. మంగళవార నాడు నందిగామ పట్టణం నీరుకొండ నరసింహారావు సమావేశ మందరంలో జరిగిన ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, నందిగామ వారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సౌమ్యకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు సౌమ్యను సత్కరించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, వైసీపీ హయాంలో జగన్ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 1వ తేదీన జీతాలు, పెన్షన్లు అందకపోగా, ప్రతి నెలా ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూడాల్సిన దుస్థితికి తెచ్చారన్నారు. ఖజానాను ఖాళీ చేసి అప్పుల కుప్పలోకి నెట్టారని విమర్శించారు. ప్రజలు 2024లో సమర్థవంతమైన నాయకత్వానికి పట్టం కట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి నెల 1వ తేదిన పింఛన్లను నూరుశాతం పంపిణీ చేసి చూపించారన్నారు. మీ అందిరీ ఆశీర్వాదాలు తనకు ఉన్నాయని, తనను ఈ స్థాయిలో నిలబెట్టిన వారందరికీ పాదాభివందనాలని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు వారి వారి కుటుంబం పట్ల, ఆరోగ్యాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. నీరుకొండ నరసింహారావు అనారోగ్య కారణాల వల్ల ఈ సమావేశానికి రాలేకపోయారని, వారు మంచి ఆరోగ్యంతో తిరిగి మళ్లీ యధావిధిగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణంలో మా పాత్ర ఉన్నందుకు గర్వపడుతున్నానని వివరించారు. తంగిరాల ప్రభాకరరావు ఎక్కువగా ప్రజల్లో ఉంటూ ప్రజాసేవకు అంకితమయ్యారన్నారు. నాన్న ఆశయాలను కొనసాగించాలిని ప్రజలకు అండగా ఉండాలని కోరడం వారందరి తోడ్పాటుతో దిగ్విజయంగా రాజకీయాలలో కొనసాగుతున్నామన్నారు. గత ఐదేళ్లు మానసికంగా, శారీరకంగా బాధపెట్టి, 27కేసులు పెట్టినా వీటన్నింటి తట్టుకునే శక్తి ప్రజలు, మీరు ఇచ్చారని ఉద్ఘాటించారు. నగదు రహిత చికిత్స విధానం ఈ హెచ్ఎస్ 1 శాతం కాంట్రిబ్యూషన్ తో వెంటనే అమలు, పెండింగ్లో ఉన్న నాలుగు డీఆర్ లను విడుదల, అదే విధంగా కమ్యుటేషన్ కాలాన్ని 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు తగ్గించి పీఆర్సీ అమలు చేసే తదితర డిమాండ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వెచ్చా ఉమామహేశ్వరరావు, కార్యదర్శి కె.వి.యస్. ప్రసాదరావు, ప్రముఖ హోమియో వైద్యులు కాపా భాను ప్రసాద్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## చల్లపల్లి ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతా

### ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**చల్లపల్లి,మేజర్ న్యూస్ జులై 16 :** చల్లపల్లి కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలు, ఇంకా వినియోగంలోకి రాని పై అంతస్తును పరిశీలించారు. బాలింతలు, గర్భిణీలు, రోగులను పలకరించి వారికి అందిస్తున్న చికిత్సలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఇన్ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరంగం శ్రీనివాసరావు, డాక్టర్ మహేష్లతో సమావేశమై ఆసుపత్రి అవసరాలపై చర్చించారు. ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా ప్రమోట్ చేసేందుకు అనువుగా ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆసుపత్రిలో ఉన్న భవనాల సామర్థ్యమునకు తగిన సంఖ్యలో వైద్యులను, సిబ్బందిని నియమించేలా కృషిచేసి ఆసుపత్రిని మరింత వృద్ధిలోకి తెస్తామన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆసుపత్రిలో పాముకాటు ఇంజక్షన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు తమ పనుల సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పాముకాటుకు ఎవరైనా గురైతే వెంటనే ఆసుపత్రికి చేర్చి చికిత్స అందించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు అతిసారబారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఒకవేళ ఎవరైనా అతిసార లక్షణాలతో బాధపడుతూ ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన చికిత్స అందుబాటులో ఉందనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అతిసార ప్రభలకుండా ఆర్ డబ్ల్యుఎస్, పంచాయతీ, వైద్యఆరోగ్యశాఖల ద్వారా తగిన కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



**చల్లపల్లి, జులై 16, మేజర్ న్యూస్ :** అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా మంజూరైన సాయాన్ని మంగళవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బాధితులకు అందచేశారు. ఇటీవల స్థానిక నారాయణరావునగర్ ఎస్సీ కాలనీలో అగ్నిప్రమాదం కారణంగా ఒక పూరిల్లు పూర్తిగా, మరొక ఇల్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే చొరవతో ఎస్సీ కార్పోరేషన్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం బుద్ధప్రసాద్ బాధితులకు అందచేశారు. ఇల్లుపూర్తిగా కాలిపోయిన గరికపాటి యశోదకు కార్పోరేషన్ ద్వారా మంజూరైన రూ.50వేలు, పాక్షికంగా ఇల్లుకాలిన కుంభా వెంకయ్యకు మంజూరైన రూ. 20వేల చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. గరికపాటి యశోదకు పక్కా గృహ నిర్మాణానికి రూ.1.80లక్షలు, కార్పోరేషన్ ద్వారా ప్రత్యేక సహాయం రూ.63వేలు, లబ్ధిదారుని వాటా రూ.27వేలతో పక్కాగృహం మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఇన్ఛార్జి ఎంపీడీవో బూరేపల్లి అశోక్, సీనియర్ అసిస్టెంట్ శ్యాంసన్, కార్యదర్శి పివి. మాధవేంద్రరావు, శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, అడపా రవి తదితరులు పాల్గొన్నారు.

## పాండురంగ స్వామి మున్సిపల్ పాఠశాలకు ఫ్యాన్లు అందజేత



**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** ఇటీవల మంత్రి కొల్లు రవీంద్ర పాండురంగ స్వామి మున్సిపల్ పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు ఫ్యాన్స్ లేవని మంత్రి దృష్టికి తీసుకురావడంతో తక్షణమే స్పందించిన మైన్స్ జియాలజీ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాండురంగ స్వామి మున్సిపల్ పాఠశాల కు 15 ఫ్యాన్లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాదు, మాజీ వైస్ చైర్మన్ చంటి, 9వ వార్డు ఇన్ఛార్జి వంక వెంకటేశ్వర్రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో అవకతవకలు




**కంచికచర్ల జూలై 16 మేజర్ న్యూస్ :** మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న ఎన్ ఆర్ ఇ జి ఎస్ పనుల్లో జరుగుతున్న అవకతవకలపై అధికారులు దృష్టి సారించాలని గనిఆత్కూరు ఎంపీటీసీ వెంపరాల వెంకటేశ్వరావు ఆరోపించారు. కంచికచర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ షేక్ మలక్ బషీర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంపీటీసీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవకతవకలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మండలంలోని గనిఆత్కూరు కొత్తపేట, మొగులూరు తదితర గ్రామాల్లో గతంలో జరిగిన పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని, చేసిన పనులకే మరల మరల బిల్లులు చేస్తున్నారని ఆరోపించారు. గత సమావేశంలో సైతం ఈ విషయాలు ప్రస్తావించినప్పటికీ నేటికీ ఎటువంటి చర్యలు లేవన్నారు. పనులలో అవకతవకలు లేకుండా చూడాలని అధికారులను సందర్భంగా కోరారు. ఎంపీడిఓ ఏ. దీప్తి మాట్లాడుతూ పనుల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని సంబంధిత శాఖల అధికారులను హెచ్చరించారు. ఎంఈఓ బాలాజీ మాట్లాడుతూ పాఠశాలలో శానిటేషన్‌కు అవసరమైన మెటీరియల్ను పంచాయతీల ద్వారా అందించాలని, పాఠశాలల్లో మౌలిక వసతులకు పంచాయతీలు సహకరించాలని కోరారు. అమ్మ ఒడి తల్లికి వందనం వంటి పథకాలు ద్వారా లబ్ధి పొందుతున్న తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించుతున్నారని, పాఠశాలలో హాజరు తగ్గే అవకాశం ఉన్నందున అధికారులు ఈ విషయాలపై దృష్టి సారించాలని కోరారు. గ్రామాల్లో మంచినీళ్లు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి శ్రీ లక్ష్మీ తెలిపారు. పంచాయతీ రాజ్ రహదారుల నిర్వహణ కోసం నాలుగు కోట్ల నిధులతో ప్రతిపాదనలను పంపినట్లు పంచాయతీరాజ్ ఏఈ రవి కుమార్ తెలిపారు. కంచికచర్ల చెవిటికల్లు రోడ్డులో బత్తినపాడు వెళ్లే రహదారి నిర్మాణానికి 90 లక్షలు, మొగులూరు రహదారికి 2.4 కోట్లు, మున్నలూరు వెళ్లే రహదారికి 70 లక్షల రూపాయల ప్రపంచ బ్యాంకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని నివేదించారు. మండల పరిషత్ అధ్యక్షులు షేక్ మలక్ బషీర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎంపీ కేశినేని చిన్ని, నూతన ప్రభుత్వానికి మండల పరిషత్ సమావేశం ద్వారా అభినందనలు తెలిపారు. మండలం లోని గ్రామాల అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, సర్పంచ్ వేల్పుల సునీత వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నందిగామలో డివిజనల్ పీఆర్ఓ కార్యాలయం ఏర్పాటు చెయ్యాలి




**నందిగామ, జులై 16, మేజర్ న్యూస్ :** నందిగామ కేంద్రంగా సమాచార, పౌర సంబంధాల డివిజినల్(పి ఆర్ ఓ) కార్యాలయం తక్షణమే ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నందిగామ ఆర్డీవో పి రవీందర్రావుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జర్నలిస్టులు అందజేశారు. స్పందిస్తూ జర్నలిస్టులకు మేలు చేసే ప్రతి అంశాన్ని సహకరిస్తానని హామీ ఇచ్చారు తక్షణమే నందిగామలో డివిజనల్ పిఆర్ఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అనంతరం జర్నలిస్టులు సంగం నాయకులు మాట్లాడుతూ నందిగామలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని నందిగామ ఆర్ డి ఓ ఎ రవీంద్ర రావు పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు అనేక సమస్యలు ఉన్నాయని వాటిని తక్షమే పరిష్కరించాలని నందిగామ ఆర్‌డిఓ రవీంద్ర రావుకు నందిగామ జర్నలిస్టులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ డి ఓ రవీంద్ర రావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేస్తామని జర్నలిస్టులకు హామీ ఇచ్చారు.. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘ నాయకులు మాట్లాడుతూ నందిగామ కేంద్రంగా డివిజనల్ పిఆర్ఓ అఫీసును ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టుల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడేషన్ మంజూరు చేయాలని,గత మూడు దశాబ్దాలుగా ఎన్నో వడిదుడుకులు ఎదుర్కొని వృత్రిలో,కుటుంబంలో ఎన్నో సదక బాధలు ఉన్న ప్రజలకు మేలు చెసేవిధంగా పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఉచితంగా 200గజాల స్థలాన్ని కేటాయించాలని, జర్నలిస్టులకు 10లక్షల రూపాయలు ప్రమాదభీమా వర్తింప చేయాలి, జర్నలిస్టు పిల్లలకు 100% ఫీజు రాయితీ ఇవ్వాలని, వీటితో పాటు అనేక డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని జర్నలిస్టు సంఘ నాయకులు ఆర్ డి ఓ రవీంద్ర రావు కు అందజేశారు..ఆర్ డి ఓ రవీంద్ర రావు సానుకూలంగా స్పందించారు..ఈ కార్యక్రమంలో ది న్యూ ఇండియన్ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు పి.మీరాహుస్సేన్ ఖాన్, జర్నలిస్ట్ సంఘాల రాష్ట్ర నాయకులు అకుల వెంకటనారాయణ, పఠాన్ సైదాఖాన్,పంగులూరి వెంకట్రావు, ఖుద్దస్, మీరా పాల్గొన్నారు.

# ప్రభుత్వ పక్షాన ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించాలి

**ప్రతి ఏటా అమరావతి సాంస్కృతిక మహోత్సవాలు జరపాలి**

**సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు నవ్యాంధ్ర రచయితల సంఘం విన్నపం**



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను నవ్యాంధ్ర రచయితల సంఘం నాయకులు మంగళవారం సెక్రటేరియట్లోని ఆయన ఛాంబర్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కవులు, రచయితలు, కళాకారుల సమస్యల గురించి, వారి జీవితాల్లో కోల్పోయిన నాలుగు ఉగాదుల గురించి పది నిమిషాలపాటు మంత్రితో చర్చించారు. ప్రతి ఏటా ప్రభుత్వం అమరావతి మహోత్సవాల పేరిట సాహిత్య, సాంస్కృతిక, కళారంగాలకు సంబంధించిన కార్యక్రమాలు చేయాలని, ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా నిర్వహించాలని కోరారు. అధికార భాషా సంఘాల, వివిధ అకాడమీల ఏర్పాటులో రాజకీయ వ్యక్తులకు కాకుండా భాషా, సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాలలో నిష్ణాతులైన వారిని, ప్రతిభావంతులైన వారిని అకాడమీల చైర్మన్లుగా, డైరెక్టర్లుగా, మెంబర్లా నియమించాలని, ఉగాది పురస్కారం, హంస పురస్కారం పేర భాషావేత్తలకు, కవులకు, రచయితలకు, విమర్శకులకు, జానపద, నాటక, నృత్య, సినీ, సంగీత, కళాకారులను నగదుతో సత్కరించాలని, అర్హులైన కవులు, రచయితలు, భాషావేత్తలు, సాహిత్యకారులు, వివిధ రంగాల కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని.... అధికార భాషా సంఘం ద్వారా ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తప్పనిసరిగా మాతృభాష విద్యాబోధనను అమలు చేసేలా జీ.వోను తీసుకురావాలని, అన్ని జిల్లాల్లోనూ సాహిత్య, సాంస్కృతిక, కళలను ప్రదర్శించుకోవడానికి కళావేదికలను నిర్మించాలని మంత్రిని కోరారు. ఇంకా పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, రాష్ట్ర కో ఆర్డినేటర్ కుర్రా సురేష్ బాబు అందజేశారు. మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ లేఖను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి అందజేసి చర్చించి, తప్పనిసరిగా నవ్యాంధ్ర రచయితల సంఘంతో పాటు కలిసొచ్చే అన్ని సంఘాల సమన్వయంతో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. తెలుగుభాష అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలైనా చేసేందుకు సిద్ధంగా వుందని మంత్రి తెలిపారు.



## వృద్ధాశ్రమ నిర్మాణానికి షిర్డి సాయి సేవాసంస్థ విరాళం

**చల్లపల్లి, జులై 16, మేజర్ న్యూస్ :** స్థానిక నిమ్మలతోటలో నిర్మితమవుతున్న సీయోను వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి విజయవాడ షిర్డి సాయి సేవాసంస్థ సభ్యులు రూ.40వేల విరాళాన్ని అందించారు. చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని నాని ద్వారా ఆశ్రమ నిర్మాణ విషయం తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు మంగళవారం చల్లపల్లి వచ్చి నిర్మాణపు పనులను పరిశీలించారు. నాని చేతులమీదుగా విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు దంపతులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రముకులు గొర్రెపాటి పిచ్చేశ్వర రావు, దాసి సీతారామరాజు, బుల్లా కిషోర్, సేవాసంస్థ ముఖ్యులు నాదెళ్ల ఉమాదేవి, వి.కామేశ్వరి, జి.మహాలక్ష్మి, ఎం.నళిని, పి.విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

## ధర్మం కోసం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ చేసుకునేదే మొహర్రం



**నందిగామ, జూలై 16, మేజర్ న్యూస్:**నమ్ముకున్న ధర్మం కోసం, సత్యం కోసం మహమ్మద్ ప్రవక్త మనవలు అయినటువంటి ఇమామ్ హుస్సేన్ కుటుంబ సభ్యులతో సహా 72 మంది చేసిన ప్రాణ త్యాగాలను స్మరించుకుంటూ చేసుకునేది మొహర్రం అని తెలిపారు సూఫీ మత గురువు అల్తాఫ్ బాబా. మొహరం సందర్భంగా నందిగామ పట్టణంలోని చిన్న మసీదు వద్ద పీర్ల పంజా ముజావర్లు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తో కలిసి ప్రారంభించారు.ముందుగా పీర్ల వద్ద సౌమ్య కొబ్బరికాయ కొట్టి, అల్తాఫ్ బాబా ప్రత్యేక ప్రార్ధనలు (ఫాతెహ ఖానీ) నిర్వహించారు. ఇమామ్ హుస్సేన్ కుటుంబ సభ్యుల త్యాగాలని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని, సాటి మనిషికి తన వంతు సహాయం అందించాలని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలని తెలిపారు. ఎమ్మెల్యే, అల్తాఫ్ బాబాను శాలువా పూలమాలతో రాష్ట్ర కార్యదర్శి లాయర్ కరిముల్లా, మైనార్టీ నాయకులు షేక్ ఖాజా, కమిటీ సభ్యులు, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఇమామ్ జానీ, జమీర్, సమీర్, నాని, మస్తాన్ తదితరులు సన్మానించారు.

## పామాయిల్ సాగుపై అవగాహన కార్యక్రమాలు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పామ్ ఆయిల్ సాగుపై జిల్లాలోని రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వెల్లడించారు. మంగళవారం ఉదయం ఆయన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బిందు సేద్యం, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన సూక్ష్మ(బిందు) సేద్య పథకం, పామాయిల్ సాగుపై అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో పామాయిల్ అత్యధికంగా సాగవుతుందని, గత సంవత్సరం నుండి అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో సైతం పామాయిల్ సాగుతున్నట్లుగా గుర్తించామని అధికారులు వివరించారు. పామాయిల్ సాగు చేపట్టే రైతులకు హెక్టారుకు 143 మొక్కలను నాలుగు సంవత్సరాల పాటు ఉచితంగా అందిస్తామని, పంట అయిదవ సంవత్సరం నుంచి చేతికి వస్తుందని, ఆ లోపుగా నాలుగు సంవత్సరాల వరకు ఎరువుల సబ్సిడీ నిమిత్తం సంవత్సరానికి హెక్టారుకు రూ.5,200 లను రైతులకు అందించడం జరుగుతుందని ఉద్యానవన శాఖ అధికారి జే జ్యోతి కలెక్టర్కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పామాయిల్ సాగు చేసే రైతులు నాలుగు సంవత్సరాలు పాటు ఓపికగా సాగును నిర్వహించగలిగితే ఐదవ సంవత్సరం నుంచి మంచి ఆదాయం పొందవచ్చు అన్నారు.

# నేడు తొలి ఏకాదశి





**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న తొలి ఏకాదశి పండుగలకు ఆది. తెలుగు సంవత్సరంలో అన్ని పండగలను వెంటపెట్టుకోచ్చే తొలి ఏకాదశి విశిష్టత ఏంటో తెలుసుకుందాం.

### తొలి ఏకాదశి అంటే ఏమిటి

ఆషాడ శుద్ధ ఏకాదశిని "తొలి ఏకాదశి" అంటారు. సంవత్సరం మొత్తం మీద వచ్చే 24 ఏకాదశులు (ప్రతీ నెల కృష్ణ పక్షంలో ఒకటి, శుక్ల పక్షంలో ఒకటి మొత్తంగా రెండు ఏకాదశులు వస్తాయి.) ఏదో ఒక ప్రత్యేకత సంతరించుకుంటాయి. ఏకాదశి అంటే పదకొండు అని అర్థం. మనకు ఉన్నటువంటి ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు వీటిని పనిచేయించే అంతరేంద్రియం అయిన మనసు కలిపితే పదకొండు. ఈ పదకొండు ఏకోన్ముకంగా పనిచేసే సమయమే ఏకాదశి.

### తొలి ఏకాదశి విశిష్టత

ఆషాఢ మాస ఏకాదశి తొలి ఏకాదశిగా (ఆషాఢ శుద్ధ ఏకాదశిగా) జరుపుకుంటారు. దీనినే "శయన ఏకాదశి, ప్రథమ ఏకాదశి", "హరివాసరం" అని కూడా అంటారు. ఈ రోజు నుంచీ శ్రీ మహావిష్ణువు క్షీరాబ్ధి యందు శేషపాన్పు పైన శయనిస్తాడు. కనుక దీన్ని "శయన ఏకాదశి" అంటారు. నిజానికి ఒక రకంగా పరిశీలిస్తే, ఇది ప్రకృతిలో జరిగే మార్పులకు (పంచ భూతాలు, సూర్య చంద్రులు, గ్రహాలు పరస్పర సంబంధాన్నీ, వాటి గమనాన్ని బట్టి) సంకేతంగా చెప్పుకోవచ్చు. ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు ఈరోజు నుండి దక్షిణ దిశకు వాలుతున్నట్టు కనిపిస్తాడు (సూర్యుడు దక్షణం వైపుకు మరలినట్లు, ఈ రోజు నుంచి దక్షణాయన ప్రారంభాన్ని సూచిస్తుంది). అంతేగాక చాతుర్మాస్య వ్రతం కూడా ప్రారంభమౌతుంది. ఇదే రోజున గోపద్మ వ్రతమును ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఈ రోజు మొదలుకొని, కార్తీక మాస శుక్ల పక్ష ద్వాదశి వరకు అంటే క్షీరాబ్ధి ద్వాదశి వరకు ఆచరించవలెనని పురాణాలు చెబుతున్నాయి.

తొలి ఏకాదశి జరుపుకొను విధానం, నియమాలు

మహిమాన్వితమైన ఈ ఏకాదశి పర్వదినాన వ్రతాన్ని ఆచరిస్తే సూర్యచంద్ర గ్రహణములలో భూమి దానాలిచ్చినంత, అశ్వమేధ యాగం చేసినంత, అరవై వేల సంవత్సరాలు తపస్సు చేసినంత పుణ్యం లభిస్తుందని ఏకాదశి వ్రత మహత్యాన్ని గురించి మన పురాణాలు చెబుతున్నాయి. మహాసాధ్వీ సతీ సక్కుభాయి ఈ వ్రతాన్నే ఆచరించి మోక్ష సిద్ధి పొందటం జరిగింది.

### వ్రతంలోని ప్రధాన నియమాలు

ఉపవాస ఫలితాలు: ఈ వ్రతాన్ని ఆచరించదలచినవారు దశమి నాడు రాత్రి నిహారులై ఉండి ఏకాదశి నాడు సూర్యోదయానికి ముందుగా కాలకృత్యాలు తీర్చుకుని శ్రీహరిని పూజించాలి. ఆ రోజు మొత్తం ఉపవాసం ఉండాలి. అసత్యమాడరాదు. స్త్రీ సాంగత్యం పనికి రాదు. కాని పనులు, దుష్ట ఆలోచనలు చేయకూడదు. ఆ రోజు రాత్రంతా జాగరణ చేయాలి. మర్నాడు అనగా ద్వాదశి నాడు ఉదయాన్నే కాలకృత్యాదుల అనంతరం శ్రీహరిని పూజించి నైవేద్య తాంబూలాలు సమర్పించి భోజనం చేయాలి. అన్నదానం చేయడం చాలా మంచిది. ఆషాఢమాస తొలి ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే లేచి, శుచిగా స్నానమాచరించి, శ్రీహరి నిష్ఠ నియమాలతో పూజించాలి. పూజ గదిని శుభ్రం చేసుకుని విష్ణుమూర్తి ప్రతిమకు లేదా పటానికి పసుపు, కుంకుమలు పెట్టి పుష్పాలతో అలంకరించుకోవాలి. తర్వాత చక్కెర పొంగలిని నైవేద్యంగా పెట్టి కర్పూర హారతివ్వాలి.

ఏకాదశి వ్రతమాచరించే వారు కాల్చి వండినవి, మాంసాహారం, పుచ్చకాయ, గుమ్మడి కాయ, చింతపండు, ఉసిరి, ఉలవలు, మినుములు తీసుకోకూడదు. అదేవిధంగా మంచంపై శయనించడం చేయకూడదని పురాణాలు చెబుతున్నాయి. ఈ ఏకాదశి విశిష్టతను గురించి పద్మ పురాణంలో వివరించారు. అష్టకష్టాలతో తల మునుకలౌతున్న మానవజాతిని ఉద్ధరించటానికి సాక్షాత్ శ్రీహరే ఈ ఏకాదశిని ఏర్పాటు చేసాడనీ, ఈ వ్రతాన్ని నియమనిష్టలతో ఆచరించిన వారు సమస్త వ్యధల నుంచీ విముక్తి పొందగలరనీ, మరణానంతరం వైకుంఠ ప్రాప్తి లభిస్తుందనీ పద్మ పురాణంలో పేర్కొన్నారని చెప్తుంటారు.

ఈ రోజు నుండి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు 'చాతుర్మాస్య వ్రతం' అవలంబిస్తారు. శాకాహారులై ఉపవాస వ్రతం ఆచరించాలన్నది, ఈ చాతుర్మాస్య వ్రత నియమం. ఏకాదశినాడు ఉపవసించి, మర్నాడు పారణ చేసి, ప్రసాదం తీసుకొని వ్రతం ముగిస్తారు. ఇది ముఖ్యంగా రైతుల పండుగ. ఏరువాక లాగే తొలి ఏకాదశిని వేడుక చేసుకుంటారు. అతివృష్టి, అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకోకూడదని, పైరుకు ఏ రకమైన తెగుళ్ళు సోకకూడదని, ఇతరత్రా ఏ సమస్యలూ ఎదురవకూడదని దణ్ణం పెట్టుకుంటారు. తొలి ఏకాదశి పండుగ నాడు మొక్కజొన్న పేలాలను మెత్తటి పొడిగా దంచి, అందులో నూరిన బెల్లం కలిపి దేవుడికి నైవేద్యంగా సమర్పించి, ప్రసాదంగా తీసుకుంటారు. తొలి ఏకాదశినాడు ఈ పేలపిండిని తప్పకుండా తినాలని విశ్వసిస్తారు.

### తొలి ఏకాదశి రోజున శేషసాయిని పూజిస్తే

ప్రతినెలా వచ్చే ఏకాదశి రోజున శ్రీహరిని పూజిస్తే అష్టైశ్వర్యాలు చేకూరుతాయని పండితులు అంటున్నారు. ఈ మాసంలోనే బోనాలు, పశు పూజ, శకట ఆరాధనలు చేస్తారు.

ముఖ్యంగా ఆషాఢమాసం వచ్చే తొలి ఏకాదశి రోజున ఒంటి పూట భోంచేసి, శేషశాయి అయిన లక్ష్మీనారాయణ మూర్తిని స్తుతిస్తే కోటి పుణ్యాల ఫలం లభిస్తుందని విశ్వాసం. ఆషాఢమాసము శుక్లపక్ష ఏకాదశి నాడు విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని తొలిఏకాదశిగా పరిగణిస్తారు. స్వామి నిద్రించే రోజు కాబట్టి దీనిని శయన ఏకాదశి అని కూడా అంటారు. సతీ సక్కుబాయి ఈ శయన ఏకాదశి నాడే మోక్ష ప్రాప్తి పొందింది. తొలిఏకాదశి నాడు రోజంతా ఉపవాసం ఉండి, రాత్రికి జాగారం చేసి, మర్నాడు ద్వాదశినాటి ఉదయం విష్ణుమూర్తిని పూజించి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆ తర్వాత భోజనం చేస్తే జన్మజన్మల పాపాలు ప్రక్షాళనమవుతాయని నమ్మకం. ఆ రోజు యోగనిద్రకు ఉపక్రమించే విష్ణువు మళ్ళీ నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొంటాడంటారు. దానిని ఉత్థాన ఏకాదశి అంటారు. ఆ తర్వాత రోజు వచ్చే ద్వాదశినే క్షీరాబ్ధి ద్వాదశి అంటారు. ఈ నాలుగు నెలల కాలాన్నీ పవిత్రంగా పరిగణించి అందరూ చాతుర్మాస్యదీక్ష చేస్తారు.

# అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు**

**ఏపీలో రెండ్రోజుల పర్యటన ముగించుకున్న జమ్మూ కశ్మీర్, ఛత్తీస్ ఘర్ రాష్ట్రాల విద్యాశాఖ, యునిసెఫ్, ప్రతినిధులు**

**విజయవాడ, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవర్చడమే కాకుండా జీవన విధానాలు కూడా నేర్పిస్తున్నామని, వీటిద్వారా సమర్ధవంతమైన విద్యను అందించవచ్చుని జమ్ము-కశ్మీర్, ఛత్తీస్ ఘర్ రాష్ట్రాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, యూనిసెఫ్ ప్రతినిధులను ఉద్దేశిస్తూ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అన్నారు.



### అటల్ టింకరింగ్ ల్యాబ్స్ బాగున్నాయి

సోమవారం జమ్మూ కశ్మీర్, ఛత్తీస్ ఘర్ రాష్ట్రాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, యూనిసెఫ్ ప్రతినిధులు తమ పర్యటనలో భాగంగా కృష్ణ జిల్లాలో పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సంద ర్భంగా పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్ పనితీరు, విద్యార్థులు రూపొం దించిన వివిధ ప్రాజెక్టులు పరిశీలించి మెచ్చుకున్నారు. అనంతరం సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో ఎస్పీడీ బి.శ్రీనివాసరావుని, హబ్ అటల్ టింక రింగ్ ల్యాబ్‌లో మెంటార్ షిప్ చేసిన ఇంజినీరింగ్ విద్యార్థులను కలిశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్న్‌షిప్‌లలో భాగంగా ఏటీఎల్‌లతో కలిసి పనిచేసిన ఇంజినీరింగ్ విద్యార్థులను ఎస్పీడీ, అతిథులు సర్టిఫికేట్ ద్వారా సన్మానిం చారు. రెండో రోజు మొవ్వ ఎస్ఎంకె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హబ్ అటల్ టింకరింగ్ ల్యాబ్, రెడ్డి గూడెంలోని ఏపీమోడల్ స్పోకు స్కూల్ ను సందర్శించి తమ పర్యటన ముగించుకని సమగ్ర శిక్షా కార్యాలయానికి చేరుకున్న ఆ ప్రతినిధులకు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు వీడ్కోలు పలికారు. ఈ సమావేశంలో సీమ్యాట్ డైరెక్టర్ వి.ఎన్. మస్తానయ్య, సమగ్ర శిక్షా ఏఎస్పీడీ డా. కె.వి.శ్రీని వాసులు రెడ్డి, అటల్ ఇన్నోవేషన్ మిషన్ నుండి ప్రతీక్ దేశ్ ముఖ్, యూనిసెఫ్ ప్రతినిధులు శేషగిరి మధుసూధన్ రావు, శిఖా రానా, సుదర్శన్, ప్రియాంక, స్వాతి, ఎస్‌సీఈఆర్‌టీ నుండి భాగ్యశ్రీ, విజ్ఞాన్ ఆశ్రం ప్రతినిధులు, పాఠశాల



ఏటీఎల్ ఇన్చార్జి మహమ్మద్ జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### పాల్గొన్న ప్రతినిధులు

జమ్మూ కశ్మీర్ నుండి తస్సద్దుక్ హుస్సేన్ మీర్ (డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ కశ్మీర్), అశోక్ శర్మ (డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, జమ్ము,) డానిష్ అజీజ్ (ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్, జమ్మూ, కాశ్మీర్, యు ఎన్ ఐ సి ఇ ఎఫ్, షోయబ్ దార్ (వ్యవస్థాపకుడు, సీఈవో పైజామ్ ఫౌండేషన), అమిత్ కుమార్ (టీచర్), జగదీష్ రాజ్ పనోత్రా (సీనియర్ లెక్చరర్, ఏటీఎల్ నోడల్ ఆఫీసర్ డీఎస్ఈ జమ్మూ), జగ్జీత్ సింగ్ (లెక్చరర్), ఇష్ఫాక్ అహ్మద్ మీర్ (లెక్చరర్), బషరత్ హుస్సేన్ (లెక్చరర్), నిసార్ దార్ (నోడల్ ఆఫీసర్, డీఎస్ఈకే) పాల్గొన్నారు. ఛత్తీస్ ఘర్ నుండి సమగ్ర శిక్షా స్టేట్ ఏటీఎల్ నోడల్ అధికారి అజయ్ పిళ్లై , ఏటీఎల్ నోడల్ టీచర్లు అనితా సింగ్, రీతు హండా, బి.ఎన్. యోగి, ధర్మేంద్ర రాత్రే , ఆశిష్ శ్రీవాస్తవ, సుశీల్ పటేల్, అసిస్టెంట్ డైరెక్టర్, రంజు కుమార్ యూనిసెఫ్ స్టేట్ కన్సల్టెంట్, ఛాయా కున్వర్ యూనిసెఫ్ ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్

# గుంటూరు తూర్పు ను ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలి

## పురపాలక శాఖ మంత్రి నారాయణ ను కోరిన ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** గుంటూరు తూర్పు నియోజకవర్గం ఉన్న డ్రైనేజీ, రోడ్లు శానిటేషన్, విద్యుత్ సమస్యలను తీర్చి ఆదర్శ వంతంగా చేయటానికి తగు సహాయం చేయాలని మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ని మంగళవారం.కలిసి అభ్యర్థించారు. విజయవాడలోని సి ఆర్ డి ఏ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ చేకూరి కీర్తి, కేంద్ర మంత్రి పేమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు రవి తో కలిసి గుంటూరు తూర్పు నియోజకవర్గం సమస్యల పై చర్చించారు. నియోజకవర్గం లో స్లం ఏరియాల్లో డ్రైనేజి వ్యవస్థ అస్త వ్యస్తంగా ఉందని, కొన్ని కాలనీల్లో సిమెంట్ రోడ్లు లేవని, మరియు కొన్ని చోట్ల రోడ్లు పూర్తిగా పాడాయిపోయి ఉన్నాయని, కొన్ని కాలనీల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకొనివచ్చారు. కేవలం మునిసిపల్ వాటర్ మెయింటైన్స్ చేయుటకు ఒక ప్రత్యేక ఇంజనీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని, గత 40 సంవత్సరాలకు పైగా పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇప్పించాలని మరియు ఆటోనగర్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ వద్ద నూతనంగా అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేయాలని మంత్రి నారాయణ ని ఎమ్మెల్యే నసీర్ కోరారు.ఈ విషయాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి నారాయణ క్షుణ్ణంగా పరిశీలించి తగు విధంగా అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే నసీర్ కు హామీ ఇచ్చారు

## ఉచిత ఇసుక విధానంలో మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దు: ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన

- **డంపింగ్ యార్డుల్లో 43 లక్షల టన్నుల ఇసుక ఉంది**
- **అక్టోబర్ తర్వాత ఇసుక రీచ్ లు అందుబాటులోకి వస్తాయి**
- **లోటు బడ్జెట్ ను దృష్టిలో ఉంచుకొని మంత్రులు పనిచేయాలి**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య. బ్యూరో** ఉచిత ఇసుక విధానంలో మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని చెడ్డపేరు తెచ్చుకోవద్దని సీఎం చంద్రబాబు సూచించారు. మంగళవారం కేబినెట్ భేటీ ముగిశాక రాజకీయ అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. "అక్టోబరు తర్వాత ఇసుక రీచులన్నీ అందుబాటులోకి వస్తాయి. బోట్ సొసైటీలకు కూడా అనుమతి ఇస్తున్నాం. డంప్ యార్డుల్లో 43 లక్షల టన్నుల ఇసుక ఉంది. వచ్చే 3 నెలల్లో కోటి టన్నుల ఇసుక అవసరం. నదుల్లో పూడిక, బోట్ సొసైటీల ద్వారా 80లక్షల టన్నుల ఇసుక వస్తుంది. కొత్త మంత్రులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలి.

లోటు బడ్జెట్ ఉందని గ్రహించి మంత్రులు పనిచేయాలి. శాఖల సంబంధిత అంశాలపై ప్రతినెలా సమీక్ష చేయాలి. మంత్రులు తమ శాఖల పరిస్థితిని ప్రజలకు వివరించాలి. వివాదాలు లేకుండా ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలి. రాష్ట్ర ప్రయోజనాల కోసమే దిల్లీ వెళ్తున్నాం. ఈనెల 22 నుంచి ఐదు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి. పంటలబీమా పథకం అమలుకు ముగ్గురు మంత్రులతో కమిటీ వేస్తున్నాం. గత ప్రభుత్వం ప్రీమియం కట్టకుండా రైతులను మోసం చేసింది" అని చంద్రబాబు వివరించారు. కాకినాడలో ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి బియ్యం అక్రమాలపై మంత్రివర్గంలో చర్చ జరిగినట్టు సమాచారం. తండ్రి పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్, కొడుకు ఎమ్మెల్యే, ఇంకో కుమారుడు రైస్ మిల్లర్ల అసోసియేషన్ చైర్మన్. ఈ ముగ్గురూ కలిసి బియ్యం రీ సైక్లింగ్ చేసి కిలో రూ.43కి ఎగుమతి చేశారని ఆక్షేపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాలని నాదెండ్ల మనోహర్ తెలిపారు. వచ్చే మంత్రివర్గ సమావేశంనాటికి ఏం చేద్దాం అనే దానిపై విధివిధానాలతో రావాలని నిర్ణయించారు

## కర్పూరి ఠాకూర్ విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తాం

### మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు హామీ



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో** గుంటూరు నగరంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత రత్న "జననాయక్ కర్పూరీ ఠాకూర్" విగ్రహ ఏర్పా టుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం "జననాయక్ కర్పూరీ ఠాకూర్ ఫౌండేషన్ సభ్యులు మేయర్ ను సంపత్ నగర్ లోని వారి క్యాంపు కార్యాలయంలో కలసి "జననాయక్ కర్పూరీ ఠాకూర్" గారి విగ్రహాన్ని గుంటూరు నగరంలో స్థాపించుటకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు జన నాయక్ కర్పురి ఠాకూర్ గారు స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని, ముఖ్యంగా క్విట్ ఇండియా ఉదయంలో పాల్గొని 26 నెలలు జైలు జీవితం గడిపారన్నారు. అనంతరం బీహార్ రాష్ట్రానికి రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీహార్ రాష్ట్రంలో విద్యారంగానికి అధిక ప్రాదాన్యతనిచ్చారని తెలిపారు. "జననాయక్ కర్పూరీ ఠాకూర్ ఫౌండేషన్" సభ్యులు ఆయన విగ్రహాన్ని గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డు లోని ఇన్నర్ రోడ్డు సమీపంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు సహకరించాలని వినతి పత్రం సమర్పించారని, ఇన్నర్ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ నకు అంతరాయం లేకుండా ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేయుటకు సహకరిస్తామన్నారు.సదరు కార్యక్రమంలో జననాయక్ కర్పూరీ ఠాకూర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ పి.వి రమణయ్య, ట్రెజరర్ కె. దేవి ప్రసాద రావు, ఈ.సి మెంబెర్ బాల తాత , ఇతర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## హాస్టల్స్ ను సందర్శించిన కలెక్టర్



**తాడికొండ మేజర్ న్యూస్ :** నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల, బీసీ బాలికల వసతి గృహాన్ని, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం సందర్శించారు. గురుకుల పాఠశాలలో మొత్తం ఎంతమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు, స్టడీ ఎలా ఉంది, అనే వివరాలను ప్రిన్సిపాల్ మరియదాసు ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు .పదవ , ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థుల తరగతి గదిని సందర్శించారు. దక్షిణ ఆఫ్రికా మాజీ అధ్యక్షులు నెల్సన్ మండేలాకు సంబంధించిన పాఠ్యాంశాన్ని చదవాలని పదవ తరగతి చదువుతున్న యెహోషువ ,క్రాంతి అనే విద్యార్థులను కోరారు .అలాగే ఏడవ తరగతి చదువుతున్న కార్తికేయ, అరవింద అనే విద్యార్థులతో బ్లాక్ బోర్డుపై లెక్కలు చేయించారు. ప్రయోగశాల, వంటగది ,మరుగుదొడ్లను పరిశీలించారు. స్థానిక డాక్టర్లు విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్నా రా అంటూ వాకబు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. .అనంతరం బీసీ బాలికల వసంత గృహాన్ని సందర్శించారు .మెనూ, హాస్టల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో మంచినీటి సమస్య ఉందని ,మురుగు బయటకు వెళ్లే పరిస్థితి లేదని తెలపటంతో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీకర్, బీసీ వెల్ఫేర్ డిడి మధుసూదన్ రావు ,అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి భవాని , తర్వాత వార్డెన్ మార్గరెట్ ,సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు ,తాసిల్దారు మధుసూదన్ రావు ,ఎంఈఓ లు తెనాలి ఇందిరా, ప్రభాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

## ఈనెల 17 18 న సిపిఐ, ప్రజా సంఘాల విస్తృత సమావేశాలు.. పుప్పాల సత్యనారాయణ




**పొన్నూరు మేజర్ న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ గుంటూరు జిల్లా కార్యవర్గ ,కౌన్సిల్ , మరియు ప్రజా సంఘాల విస్తృత సమావేశాలు ఈనెల 17 18 తేదీలలో గుంటూరు సిపిఐ కార్యాలయం నందు జరుగుచున్నది అని భారత కమ్యూనిస్టు పార్టీ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల. సత్యనారాయణ అన్నారు. పొన్నూరులో స్థానిక ఐలాండ్ సెంటర్ వద్ద సమావేశములకు సంబంధించిన కరపత్రములను రిలీజ్ చేశారు ఈ సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 17 18 తేదీలలో గుంటూరు సిపిఐ కార్యాలయంలో జరిగే సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ నాగేశ్వరరావు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి అక్కినేని వనజ సిపిఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని, దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న మతోన్మాద పైశాచిక దాడులకు వ్యతిరేకంగా కార్పొరేట్ అనుకూల పేదల వ్యతిరేక విధానాలకు నిరసనగా క్షేత్రస్థాయిలో నుంచి కార్యకర్తలను సమాయత్తం చేయడానికి దిశ నిర్దేశం చేస్తారని అన్నారు అంతేకాకుండా అంతర్జాతీయ జాతీయ రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, సిపిఐ వైఖరిని వెల్లడిస్తారని అన్నారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు ఏఐటీయూసీ నాయకులు గుంటూరు ఏడుకొండలు కంచర్ల సుధీర్ గుర్రపు శాల అచ్చయ్య ఆరేటి సురేష్ షేక్ అబ్దుల్ నభి తదితరులు పాల్గొన్నారు.

## నిశ్చల మనస్సుతో స్మరించిన పరమాత్మకు చేరువవుతారు



**గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్:** నిశ్చలమైన మనస్సుతో నిరంతరం ధ్యానం చేసిన పరమాత్ముని చేరవచునని చిన్మయామిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మాటూరి జగన్మోహనరావు, చెన్నలక్ష్మి దంపతులు సౌజన్యంతో "శ్రీమద్భగవద్గీతలోని అక్షర బ్రహ్మయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సువీరానందస్వామి ప్రవచిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునితో నీవు సర్వదా నన్నే స్మరించు, యుద్ధమున కర్తవ్యకర్తను కూడా చేయుచూ ఈ విధంగా నీ మనోబుద్ధులను నాయందే నిలిపినచే నన్నే పొందెదవన్నారు. మనస్సును వేరు ధ్యాస ఏ మాత్రమూ లేకుండా నిరంతరము పరమేశ్వరుని ధ్యానరూపమై సాధనచేసిన మానవుడు దివ్యపురుషుడైన పరమాత్మను చేరునన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక మొహరం ఎమ్మెల్యే - గళ్ళా మాధవి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** భారతదేశంలో మత సామరస్యానికి ప్రతీకగా మొహరం పండుగ నిలుస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం శ్రీనివాస రావు పేటలోని పలు పీర్ల చావిడిలో జరిగిన మొహరం వేడుకలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యి పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముజావర్లు ఎమ్మెల్యే కు ఫకీర్ల మేళ తాళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ.... మొహరం నాడు అనాదిగా జరుపుకొనే పీర్ల కొలుపు హిందూ–ముస్లింల ఐక్యతకు ప్రతీకగా తెలుగునాట నిలుస్తోంది. మత సామరస్యాన్ని పరిఢవిల్ల చేస్తోంది. ఇది ఇలాగే కొనసాగాలని, ఇస్లాం పరిరక్షణకు ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన అమరులను స్మరించి, ప్రార్థించే ఈ మొహరం పవిత్ర దినాన ఇస్లాంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆ భగవంతుడు ఆశీస్సులు అందచేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి కోరుకున్నారు.